జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు


9440231967, 7989694528

రంగారెడ్డి ఆదివారం 29 మార్చి 2026 సంపుటి : 16 సంచిక : 245 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## డబుల్- ఇంజిన్ విధానం ద్వారా ఇది సాధ్యం!



- పశ్చిమాసియా ఉద్రిక్తతలను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోంది
- నోయిడా ఫేజ్-1 విమానాశ్రయాన్ని ప్రారంభించిన మోదీ
- యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని హామీ
- "సమాజ్‌వాదీ పార్టీ నోయిడాను దోపిడీకి ఏటీఎంలా మార్చింది
- కానీ నేడు బీజేపీ ప్రభుత్వ హయాంలో యూపీ అభివృద్ధికి చోదక శక్తిగా మారుతోంది



## దీదీ చేసేవన్నీ 'విక్టిమ్ కార్డ్' రాజకీయాలు

- టీఎంసీ ప్రభుత్వంపై ఛార్జ్ షీట్ విడుదల చేసిన అమిత్ షా
- మమతా బెనర్జీ బాధితురాలిగా నటిస్తున్నారంటూ ఎద్దేవా

## తమిళనాడులో డీఎంకే 164, కాంగ్రెస్ 28 స్థానాల్లో పోటీ



ఇతర మిత్రపక్షాలకు 42 సీట్లు కేటాయింపు

164 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన డీఎంకే



## కశ్మీరీ పండిట్ల భూములను తిరిగి వారికే ఇచ్చేశాం

కశ్మీరీ పండిట్ల 466.15 ఎకరాలకు కబ్జాల నుంచి విముక్తి

కబ్జా చేసిన వారిపై ఎఫ్ఐఆర్‌ల నమోదు

అసలైన హక్కుదారులకు అప్పగింత

# అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్




- 'తొలి ముద్ద'ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభించిన సీఎం
- రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనున్న ప్రభుత్వం
- అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ 'తొలి ముద్ద'ను ప్రభుత్వం ప్రారంభించింది. అసెంబ్లీ కమిటీ హాల్?లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ స్కీమ్?లో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులకు రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్ ఫాస్ట్‌గా ప్రభుత్వం అందించనుంది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్‌కు మొబైల్ ఫోన్‌లను రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ సీతా - మిగతా3లో



## ఇందిరమ్మ ఇళ్ల కోసం ఏఐ టెక్నాలజీ

- అనర్హులను ఇట్టే పట్టేస్తోందిగా
- కామారెడ్డి జిల్లాలో 12,021 ఇళ్లు మంజూరు
- జాబితాలో వంద మంది అనర్హులు
- బోగస్‌లకు చెక్ పెట్టేందుకు ఏఐ వాడకం
- గతంలో లబ్ధి పొందినవారికి మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్

పేదవారి కోసమని అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారు. తమకు ఇళ్లు లేదని చెప్పి అధికారుల కళ్లు గప్పి వారి పేరిట ఇళ్లు మంజూరు అయ్యేలా చేసుకున్నారు. దీని ద్వారా అర్హులైన వారికి ఈ పథకం అందకుండా పోతుంది. - మిగతా3లో

# అక్రమ మైనింగ్‌లపై సభలో దుమారం

- సీబీసీఐడీ విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మైనింగ్ అంశంపై దద్దరిల్లిన శాసనసభ
- అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి
- 2014 జూన్ నుంచి మైనింగ్‌పై విచారణకు ఆదేశిస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటన
- పద్దులకు శాసనసభ ఆమోదం
- "అక్రమ మైనింగ్ విచారణకు ఈ ప్రభుత్వం సిద్ధం
- గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్ర మైనింగ్‌పై విచారణ జరిపించేందుకు సిద్ధం



హైదరాబాద్

మైనింగ్ అంశంపై శాసనసభ దద్దరిల్లింది. పద్దులపై చర్చలో భాగంగా గనుల అంశంపై హరీశ్‌రావు మాట్లాడుతూ మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పొంగులేటిని ఉద్దేశిస్తూ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మండిపడిన మంత్రులు పదేళ్ల అక్రమాలను ప్రస్తావించారు. బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లో బైఠాయించి నినాదాలు చేపట్టగా ఈ క్రమంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకున్నారు. 2014 జూన్ 2 నుంచి అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. పద్దులపై చర్చలో భాగంగా అసెంబ్లీలో మైనింగ్ అంశం తీవ్ర దుమారం రేపింది. - మిగతా3లో

## ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మెట్రో విస్తరణకు ప్రభుత్వ నిర్ణయం

మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను సమీక్షించామన్న సీఎం రేవంత్ రెడ్డి

మెట్రో ఫేజ్-2బీ 86.1 కి.మీ మేర నిర్మాణం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం

# అమరావతికి చట్టబద్ధత



## ఏపీ శాసనసభ ఆమోదం

- తీర్మాన ప్రతిని కేంద్రానికి పంపిన శాసనసభ
- రాజధానికి రైతులు ఇచ్చింది భూములు కాదు రాష్ట్రానికి భవిష్యత్తు

అమరావతి

అమరావతికి చట్టబద్ధత కోసం కేంద్రాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానానికి ఏపీ శాసనసభ ఏకగ్రీవంగా అమోదించింది. ఇందు కోసం శనివారం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగానే విభజన చట్టం సెక్షన్--5(2)ను సవరించాలని కోరుతూ ఎట్ అమరావతి అనే పదాన్ని చేర్చాలంటూ అసెంబ్లీ తీర్మానం. సీఆర్డీఏ నోటిఫై చేసిన ప్రాంతాలకు కూడా రాజధాని పరిధి వర్తింప చేసేలా చట్ట సవరణ కోరుతూ తీర్మానం. రాజ్యసభ ఛైర్మన్, లోక్ సభ స్పీకర్, కేంద్ర హోమ్ మంత్రికి అమరావతిని రాజధానిగా చట్టబద్ధత కోరుతూ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పంపారు. అదేవిధంగా తీర్మానం కాపీలను కేంద్ర హోం - మిగతా3లో



## వైఎస్సార్సీపీ మళ్లీ రాదు వచ్చినా ఏం చేయలేదు

- రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు
- ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేదని తలుచుకుంటే బాధేస్తోంది
- అమరావతి తీర్మానంపై అసెంబ్లీలో మాట్లాడిన పవన్ కల్యాణ్

అమరావతి

భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని మార్చిన తెలుగువారికి ఇప్పుడు శాశ్వత రాజధాని రూపం లేకపోవటం బాధాకరమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతి తీర్మానంపై మాట్లాడిన పవన్ కల్యాణ్, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం నుంచి అమరావతికి జగన్ చేసిన అన్యాయం వరకూ వివరించారు. ప్రభుత్వం మారిన తర్వాత అమరావతిపై - మిగతా3లో

## పొరపాటున ఏ తుగ్లక్ వచ్చినా అమరావతిని మార్చలేరు

రాజధాని అమరావతి వల్ల ఎంతోమంది జీవితాలు మారాయి

కియా పరిశ్రమ వచ్చాక అనంతపురం ఐదో స్థానంలోకి వచ్చింది

హార్టికల్చర్ ద్వారా రాయలసీమ అభివృద్ధి



అమరావతి

భవిష్యత్తులో ఏ తుగ్లక్ లాంటి వ్యక్తి వచ్చినా రాజధానిగా అమరావతిని మార్చలేని విధంగా రక్షణ కల్పిస్తున్నామని మంత్రి లోకేశ్ అన్నారు. అమరావతి ఏకైక రాజధానిగా అన్ని జిల్లాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. అమరావతిపై నేటి తీర్మానం ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు శాస్వత పునాది వేసి, వారి ఆశలకు రెక్కలు తొడుగుతోందని తెలిపారు. చరిత్రలో నిలిచిపోయే సమావేశం అంటూ జై అమరావతి అని సభలో లోకేశ్ నినదించారు. ఏపీకి, అమరావతికి జగన్ అనుకూలమో వ్యతిరేకమో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వాలు కొనసాగుతూ, అభివృద్ధిని కూడా కొనసాగిస్తాయని కానీ వైఎస్సార్సీపీ మాత్రం రాష్ట్రాన్ని తీవ్రంగా విధ్వంసం చేసిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, ముఖ్యంగా జెన్‌జీ తరం గుర్తించుకోవాలని సూచించారు. జగన్ ఉంటే ఏపీకి రామని పెట్టుబడిదారులు చెబుతున్న విషయాన్నీ యువత గమనించాలన్నారు. రాజధానిగా అమరాతిని అభివృద్ధి చేయడంతో పాటు అన్ని జిల్లాలను - మిగతా3లో

# డబుల్- ఇంజిన్ విధానం ద్వారా ఇది సాధ్యం!

పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచం ఆందోళన చెందుతున్న తరుణంలో, భారత్ మాత్రం ఆ సంక్షోభాన్ని పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని మోదీ తెలిపారు. నిత్యావసరాల కొరత వల్ల ప్రపంచమంతా ఆందోళన చెందుతున్నా, ఆ భారం సామాన్య కుటుంబాలతోపాటు రైతులపై పడకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ మేరకు నోయిడా ఫేజ్?-1 విమానాశ్రయాన్ని శనివారం ప్రారంభించిన మోదీ, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు. "సమాజ్‌వాదీ పార్టీ నోయిడాను దోపిడీకి ఏటీఎంలా మార్చింది, కానీ నేడు బీజేపీ ప్రభుత్వ హయాంలో యూపీ అభివృద్ధికి చోదక శక్తిగా మారుతోంది. డబుల్- ఇంజిన్ విధానం ద్వారా ఇది సాధ్యమైంది" అని అన్నారు. 2004 నుంచి 2014 వరకు నిలిచిపోయిన విమానాశ్రయ ప్రాజెక్టును ఆలస్యం చేసినందుకు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలను ఆయన విమర్శిస్తూనే, చివరకు దానికి శంకుస్థాపన చేసి, కార్యరూపం దాల్చినందుకు బీజేపీ -ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రశంసించారు.

"గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం, గత ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేయడానికి కూడా అనుమతించలేదు. 2004 నుంచి 2014 వరకు ఇది ఫైళ్లలోనే మరుగునపడిపోయింది. సమాజ్‌వాదీ పార్టీ ఉత్తర్?ప్రదేశ్‌లో ఏ పనీ జరగనివ్వలేదు. కానీ బీజేపీ - ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శంకుస్థాపన జరిగింది, ఇప్పుడు విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నాం.



అంతేకాకుండా, దేశంలోని రెండు ప్రధాన సరుకు రవాణా కారిడార్లు దాద్రీలో కలుస్తాయి, దీనివల్ల ఈ ప్రాంతానికి అనుసంధానం మెరుగుపడుతుంది" అని ఆయన అన్నారు.

**మూఢనమ్మకాలు, రాజకీయ భయం కారణంగా!**

"ఈ ప్రాజెక్టులన్నీ ఉత్తర్?ప్రదేశ్ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ప్రకాశవంతమైన ఉదాహరణ. సెమీకండక్టర్ ఫ్యాక్టరీ భారతదేశాన్ని సాంకేతికతలో 'ఆత్మనిర్భర్'గా తీర్చిదిద్దుతోంది. మీరట్ మెట్రో, నమో భారత్ రైలు వేగవంతమైన, స్మార్ట్ కనెక్టివిటీని అందిస్తున్నాయి. ఇక నోయిడా విమానాశ్రయం ఉత్తర భారతదేశం మొత్తాన్ని ప్రపంచానికి అనుసంధానిస్తోంది," అని ప్రధాని మోదీ అన్నారు. మూఢనమ్మకాలు, రాజకీయ భయం కారణంగా ఒకప్పుడు నోయిడా ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని పేర్కొంటూ, ఆ ప్రాంతం ఎదుర్కొన్న గత సవాళ్లను ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు .

**చాలా సంతోషంగా ఉన్నా!**

"నోయిడాలో ఎక్కడ చూసినా ఉత్సాహభరితమైన, శక్తివంతమైన యువత కనిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్ తమ భవిష్యత్తుకు కొత్త అవకాశాలు ఇస్తుందని ఈ యువతకు తెలుసు. ఈ రోజు మనం వికసిత్ యూపీ, వికసిత్ భారత్?లో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాం. దేశంలో అత్యధిక అంతర్జాతీయ విమానాశ్రయాలు కలిగిన రాష్ట్రాల్లో ఉత్తర్?ప్రదేశ్ ఒకటిగా నిలిచింది. ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేసి, దానిని ప్రారంభించే అవకాశం నాకు లభించినందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకుంటున్నాను. నన్ను ప్రతినిధిగా ఎన్నుకున్న రాష్ట్రం ఇకపై గొప్ప విమానాశ్రయంతోనే గుర్తింపు పొందుతుంది" అని తెలిపారు.

**యువతకు కొత్త అవకాశాలు**

"ప్రారంభోత్సవం జరిగిపోయిందా? లేదు. ఇక్కడ ఉన్న మీరందరూ ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని నేను కోరుకుంటున్నాను. దయచేసి మీ మొబైల్ ఫోన్‌లను బయటకు తీయండి, ఫ్లాష్‌లైట్‌ను ఆన్ చేయండి, మీరే దీనిని ప్రారంభిస్తారు. నోయిడాలోని విమానాశ్రయం ఆగ్రా, మథుర, అలీగఢ్, గాజియాబాద్, మీరట్, ఇటావా, బులంద్‌షహర్, ఫరీదాబాద్ వంటి ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. ఇది పశ్చిమ ఉత్తర్?ప్రదేశ్‌లోని రైతులకు, చిన్న పరిశ్రమలకు, యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది" అని తెలిపారు.

# దీదీ చేసేవన్నీ 'విక్టిమ్ కార్డ్' రాజకీయాలు

బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శలు గుప్పించారు. మమత ఎప్పుడూ బాధితురాలిగా (విక్టిమ్ కార్డు పోలిటిక్స్?) నటిస్తుంటారని ఆరోపించిన ఆయన, దీదీ ఎత్తుగడలను బంగాల్ ప్రజలు ఇప్పుడు బాగా అర్థం చేసుకున్నారని అన్నారు. శనివారం అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వంపై ఛార్జిషీటు విడుదల చేస్తూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "మమత బెనర్జీ ఎప్పుడూ బాధితురాలిగా నటిస్తూ రాజకీయాలు చేస్తుంటారు. కొన్ని సార్లు ఆమె కాలు విరగ్గొట్టుకుంటారు. మరికొన్ని సార్లు తలకు కట్టుకుంటారు. కొన్ని సార్లు అనారోగ్యానికి గురవుతారు. ఆపై మళ్లీ ఎన్నికల సంఘం ముందు నిలబడి ఆ సంస్థను దూషిస్తూ నిస్సహాయతను ప్రదర్శిస్తుంటారు. కానీ ఇప్పుడు ఈ విక్టిమ్ కార్డు రాజకీయాలను బంగాల్? ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారు. అదే విషయాన్ని ఆమెకు చెప్పడానికి నేను ఇక్కడకు వచ్చాను. "

**ఎస్ఐఆర్ విషయంలోనూ!**

"ఇక ఎస్ఐఆర్ విషయానికి వస్తే, కేవలం బంగాల్‌లోనే న్యాయాధికారులను నియమించారు. దేశంలో మరెక్కడా ఇలాంటి పరిస్థితి కనిపించలేదు. దీనికి కారణం ఏమిటో బంగాల్ ప్రజలకు మమతా బెనర్జీ సమాధానం చెప్పాలి. ఆమె ఎస్ఐఆర్‌పై ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఈ రోజు నేను బంగాల్ ప్రజలను అడుగుతున్నాను. దేశంలోకి చొరబడినవారు బంగాల్ భవిష్యత్?ను నిర్ణయించేందుకు మనం అనుమతించాలా నేను ఒక విషయం స్పష్టం చేయాలని



అనుకుంటున్నా, ఓటర్ల జాబితా నుంచే కాదు, దేశం నుంచి కూడా చొరబాటుదారులను వెళ్లగొట్టడమే బీజేపీ పార్టీ అజెండా" అని అమిత్ షా తేల్చిచెప్పారు.

**బంగాల్‌లో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే!**

'మే 6న బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుంది. అంతేకాదు 45 రోజుల్లోగా సరిహద్దు వెంబడి కంచె వేయడానికి అవసరమైన భూమిని రాష్ట్ర బీజేపీ సర్కార్, కేంద్ర ప్రభుత్వానికి అందిస్తుంది. మేము కచ్చితంగా అక్రమ చొరబాట్లను అరికడతాం' అని అమిత్? షా పేర్కొన్నారు. బంగాల్‌లోని ఓబీసీ కేటగిరీలో 77 వర్గాలను మమతా బెనర్జీ చేర్చారు. అందులో 75 ముస్లిం వర్గాలేనని అమిత్? షా విమర్శించారు. ఇక ఇతర వర్గాలేవీ మిగిలి లేవా? ఓబీసీ హోదాను ఇకపై మతం ఆధారంగా నిర్ణయించాలా? అని ఆయన ప్రశ్నించారు. అంతేకాదు ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగదని పేర్కొన్నారు.

**నిరుద్యోగులకు వయోపరిమితి పెంపు**

బీజేపీ అధికారంలోకి రాగానే, రిక్రూట్?మెంట్ కుంభకోణాల వల్ల ఏజ్ లిమిట్ దాటిపోయిన యువతకు 5 ఏళ్లపాటు వయోపరిమితి సడలింపు ఇస్తామని అమిత్? షా హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వ హయాం పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడతామన్నారు. ముఖ్యంగా యువతకు ఎస్ఎస్?సీ నియామకాల్లో అవకాశం కల్పిస్తామని అన్నారు.

**టీఎంసీని ఓడించాలి!**

బంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి, బీజేపీ రాష్ట్ర అధ్యకుడు సమీక్ భట్టాచార్యతో కలిసి, అమిత్? షా కోల్?కతాలో టీఎంపీ ప్రభుత్వంపై శనివారం ఛార్జిషీటు విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో బంగాల్ ప్రజలు భయం, విశ్వాసాల్లో ఏదో ఒకదానిని ఎంచుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. టీఎంసీ అధికారంలోకి రావడానికి అబద్ధాలు, భయం, హింస మూలాధారాలుగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. దానికి వ్యతిరేకంగా బీజేపీ 2011 నుంచి పోరాడుతోందని అన్నారు. బంగాల్? నుంచి టీఎంసీని తొలగించాలని ప్రజలను ఆయన కోరారు. ఈసారి రాష్ట్రంలో బీజేపీనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా, బంగాల్‌లో రెండు దశల్లో అంటే ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు మాత్రం మే 4న ఒకేసారి జరుగుతుంది.

# తమిళనాడులో డీఎంకే 164 కాంగ్రెస్ 28 స్థానాల్లో పోటీ

ఏప్రిల్ 23న జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు అధికార డీఎంకే 164 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం స్టాలిన్ మరోసారి కొళత్తూరు నుంచే పోటీ చేయనున్నారు. ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ తిరిగి చేపాక్-ట్రిప్లికేన్ నుంచి బరిలో దిగుతున్నారు. అన్నాడీఎంకే నుంచి బహిష్కృతులై, ఇటీవల డీఎంకేలో చేరిన మాజీ సీఎం ఓ. పన్నీర్‌సెల్వంకు ఆయన సిట్టింగ్ స్థానమైన బోడినాయకనూర్ నుంచే డీఎంకే టికెట్ ఖరారు చేసింది.

**సీట్ల పంపకం జరిగిందిలా!**

సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్‌కు నాయకత్వం వహిస్తున్న ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే), మిత్రపక్షాలైన కాంగ్రెస్, వామపక్షాలు , వీసీకే, డీఎండీకే, తదితర పార్టీలతో సీట్ల పంపకాలను పూర్తి చేసింది. ప్రధాన మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు 28 స్థానాలు కేటాయించారు. ప్రేమలత విజయకాంత్ నేతృత్వంలోని దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం (డీఎండీకే) పార్టీకి 10 స్థానాలు దక్కాయి. విడుతలై చిరుతైగళ్ కచ్చి (వీసీకే) పార్టీకి 8 స్థానాలు కేటాయించగా, సీపీఎం, సీపీఐ చెరో 5 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. వైకో నేతృత్వంలోని మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే) పార్టీకి మధురై సౌత్ సహా 4 స్థానాలు ఇచ్చారు. కాగా మిత్రపక్షాలకు చెందిన మరో 11 మంది అభ్యర్థులకు కూడా సీట్లు కేటాయించారు. అయితే వీరు డీఎంకే పార్టీ గుర్తు అయిన 'ఉదయించే సూర్యుడు'పైనే బరిలోకి దిగుతున్నారు.

**ఎందుకింత జాప్యం?**

తమ కూటమి సీట్ల పంపకం విషయంలో జరిగిన జాప్యంపై డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్ స్పందించారు. కూటమిలోని పార్టీలు, తమ మధ్య సమతుల్యమైన ఒప్పందం కుదుర్చుకోవడానికి చాలా ఓపికగా చర్చలు జరిపాయని, అందుకే ఇంత సమయం పట్టిందని అన్నారు.

**కీలక స్థానాలు ఇవే!**



ఈసారి మంత్రి సెంథిల్ బాలాజీ- కరూర్? స్థానం నుంచి మారి, కోయంబత్తూరు సౌత్? నుంచి బరిలోకి దిగుతున్నారు. కాగా, సిట్టింగ్ మంత్రులైన కేఎన్? నెహ్రూ- మధురై సెంట్రల్?, తిరుచి వెస్ట్ నుంచి మళ్లీ ఎన్నిక కావాలని కోరుకుంటున్నారు. మంత్రి టీఆర్?బీ రాజా మళ్లీ మన్నార్గుడి నియోజకవర్గంలోనే తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నారు. మరో మంత్రి ఐ పెరియస్వామికి దిండిగల్?, మంత్రి అన్బిల్ మహేశ్? పొయ్యమొళికి తిరువేరుంబార్?, గీతా జీవన్?కు తూత్తుకిడి సీట్లు కేటాయించారు. ఇవన్నీ డీఎంకేకు అత్యంత కీలకమైన స్థానాలు. ఇక వేలచ్చేరి, ఈరోడ్ నియోజకవర్గాలు మళ్లీ కాంగ్రెస్ కోటాలోకే వచ్చాయి. ఇక ఉదగమండలంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రత్యక్ష పోటీ జరగనుంది. కాంగ్రెస్?కు చెందిన ఇతర ముఖ్యమైన స్థానాల్లో శ్రీపెరుంబుదూర్?, కడలూరు, మైలాడుతురై, శివకాశి, కృష్ణగిరి, కన్యాకుమారి ప్రాంతంలోని విళవన్?కోడ్?, కిళ్లియూర్? నియోజక వర్గాలున్నాయి. మరోవైపు వామపక్ష పార్టీలు వ్యూహాత్మకంగా అత్యంత ముఖ్యమైన స్థానాలను దక్కించుకున్నాయి. సీపీఐ తిరుప్పూర్? (నార్త్??), భవానినగర్?, సీపీఐ(ఎం) పళని, తిరువొత్తియూర్? స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టనుంది.

వీసీకేకు కట్టుమన్నార్కోవిల్?, తిరుప్పోరూర్? లాంటి నియోజకవర్గాలను కేటాయించారు. ఎండీఎంకే మధురై సౌత్, సిర్కాళితో సహా పలు కీలక స్థానాలు దక్కాయి.

**మ్యానిఫెస్టో ఎప్పుడు?**

ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని ఈ కూటమి, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మార్చి 29న తన మ్యానిఫెస్టోను విడుదల చేయనున్నట్లు పేర్కొంది.

**డీఎంకేలో 60 కొత్త ముఖాలు**

డీఎంకే ఈసారి చాలా జాగ్రత్తగా తన అభ్యర్థులను ఎంచుకుంది. ఇందులో అనుభవజ్ఞులతోపాటు, 60 మంది కొత్త వారికి అవకాశాలను కల్పించింది. డీఎంకే అభ్యర్థుల్లో 29 మంది న్యాయవాదులు, 17 మంది ఇంజినీర్లు, 15 మంది డాక్టర్లు, 7 పీహెచ్?డీ పట్టభద్రులు ఉన్నారు. అంతేకాదు 18 సీట్లను మహిళా అభ్యర్థులకు కేటాయించారు.

**గట్టిపోటీ తప్పదా?**

ఇప్పటికే ఏఐఏడీఎంకే, ఎన్?డీఏ కూటమి కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. మరోవైపు విజయ్? నేతృత్వంలోని టీవీకే కూడా మొదటిసారి బరిలోకి దిగుతోంది. అయినప్పటికీ ప్రధాన పోటీ డీఎంకే, ఏఐఏడీఎంకేకు మాత్రమే ఉండొచ్చని అంచనాలున్నాయి. మరి తమిళ ఓటర్లు ఎవరికి పట్టం కడతారో చూడాలి. 234 మంది సభ్యులు కలిగిన తమిళనాడు శాసనసభకు ఏప్రిల్? 23న ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. పొరుగున ఉన్న పుదుచ్చేరిలోని 30 స్థానాలకు ఏప్రిల్? 9న ఎన్నికలు జరుగుతాయి. ఫలితాలు మే4 ప్రకటిస్తారు.

## కశ్మీరీ పండిట్ల భూములను తిరిగి వారికే ఇచ్చేశాం

జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు (2026 మార్చి 28 నాటికి) కశ్మీరు లోయలో కశ్మీరీ పండిట్లకు చెందిన 466.15 ఎకరాల (3,729 కనాల్స్, 4 మర్లాస్) భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, అసలైన హక్కుదారులకు అప్పగించిందని ఆయన వెల్లడించారు. శనివారం రోజు అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే యుధ్‌వీర్ సేథీ అడిగిన ఓ ప్రశ్నకు బదులిస్తూ ఈవివరాలను ఒమర్ అబ్దుల్లా తెలిపారు. 2024 నవంబరు నుంచి ఇప్పటివరకు కశ్మీరు లోయలో కశ్మీరీ పండిట్లకు చెందిన 105.525 ఎకరాల ( 844 కనాల్స్, 4 మర్లాస్) భూమిని గుర్తించి, హక్కుదారులకు అప్పగించామన్నారు. అంతకుముందు 2023 డిసెంబరు నాటికే 365.5 ఎకరాల(2,924 కనాల్స్) కశ్మీరీ పండిట్ల భూమిని గుర్తించి, హక్కుదారులకు అప్పగించారని సీఎం గుర్తు చేశారు. ఈవిధంగా ప్రభుత్వ చొరవతో ఇప్పటివరకు 466.15 ఎకరాల భూమిని కశ్మీరీ పండిట్లు తిరిగి పొందారన్నారు. కాగా, జమ్మూకశ్మీరు విపత్తు నిర్వహణ, సహాయం, పునరావాసం, పునర్నిర్మాణ శాఖ మంత్రిగానూ సీఎం ఒమర్ అబ్దుల్లాయే వ్యవహరిస్తున్నారు. 1 కనాల్ అంటే అర పావు ఎకరం (0.125 ఎకరాలు). 1 మర్లా అంటే 30.25 గజాల స్థలం (0.00625001 ఎకరాలు).

**డిప్యూటీ కమిషనర్ల సారథ్యంలో భూముల గుర్తింపు**

"జమ్మూకశ్మీరు వలసదారుల స్థిరాస్థి పరిరక్షణ చట్టంలోని నిబంధనల ప్రకారం కశ్మీరీ పండిట్ల భూములను ప్రభుత్వం గుర్తించి స్వాధీనం చేసుకుంది. కశ్మీరు లోయలోని డిప్యూటీ కమిషనర్ల సారథ్యంలో అన్ని జిల్లాల అధికార యంత్రాంగాలు కశ్మీరీ పండిట్ల భూములను గుర్తించాయి. అసలైన యజమానులకు వాటిని అప్పగించాయి. ఈ భూముల అసలైన హక్కుదారులను (కశ్మీరీ పండిట్లను) గుర్తించి, వారికి భూములను అప్పగించే ప్రక్రియకు నోడల్ ఆఫీసర్లుగా అదనపు డిప్యూటీ కమిషనర్లు వ్యవహరించారు. ఈ భూముల అప్పగింత ప్రక్రియను పర్యవేక్షించి, వేగవంతం చేసేందుకు 2026 జనవరిలో ఒక స్టీరింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు.

**24 దరఖాస్తులే పెండింగ్ దశలో**

"2024 నవంబరు నుంచి ఇప్పటివరకు షోపియన్ జిల్లాలో 35.375 ఎకరాలు(283 కనాల్స్), బారాముల్లా జిల్లాలో 28.125 ఎకరాలు(225 కనాల్స్), గండేర్బల్ జిల్లాలో 18.25 ఎకరాల(146 కనాల్స్) కశ్మీరీ పండిట్ల భూములను కబ్జాల చెర నుంచి అధికారులు విడిపించారు. అనంత్ నాగ్, బందీపొర, బుడ్గామ్, కుల్గామ్, కుప్వారా, పుల్వామా, శ్రీనగర్ జిల్లాల్లోనూ కొంతమేర కశ్మీరీ పండిట్ల భూములను ప్రభుత్వం గుర్తించి స్వాధీనం చేసుకుంది. కశ్మీరు నుంచి వలస వెళ్లిపోయిన కశ్మీరీ పండిట్లు తమ భూములను క్లెయిమ్ చేసుకునేందుకు ఒక ఆన్‌లైన్ గ్రీవెన్స్ రిడ్రెసల్ పోర్టల్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోంది. దానికి ఇప్పటిదాకా 10,173 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 9,713 దరఖాస్తులను అధికారులు పరిష్కరించి, 7,829 మందికి భూములను తిరిగి అప్పగించారు. కశ్మీరీ పండిట్ల ఇంకో 24 దరఖాస్తులే పెండింగ్ దశలో ఉన్నాయి" అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చెప్పారు.

**కబ్జా చేసిన వారిపై ఎఫ్ఐఆర్‌ల నమోదు**

"కశ్మీరీ పండిట్ల భూములను కబ్జా చేసిన వారిపై ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయాలని నేను డిప్యూటీ కమిషనర్లను ఆదేశించాను. ఆ భూములను గుర్తించిన వెంటనే జియో ట్యాగింగ్ చేయాలని సూచించాను. తద్వారా వాటిని కశ్మీరీ పండిట్లకు అప్పగించే వరకు అవకతవకలు జరిగే అవకాశాలు ఉండవు. కశ్మీరీ పండిట్ల భూముల వివరాల ప్రకారం రెవెన్యూ రికార్డులను అప్‌డేట్ చేయిస్తున్నాం. ఆయా భూములను చౌకగా అమ్ముకునే ఘటనలను కూడా నిశితంగా పర్యవేక్షించమని అధికారులకు చెప్పాను. కశ్మీరీ పండిట్ల కోసం ఏప్రిల్ 1 నుంచి 28 వరకు జమ్మూలో ఆన్ ది స్పాట్ గ్రీవెన్స్ రిడ్రెసల్ క్యాంపులను నిర్వహించాలని మేం భావిస్తున్నాం" అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

**కశ్మీరీ పండిట్ల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు**

"కశ్మీరీ పండిట్ల కోసం మేం చాలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఒక్కో కశ్మీరీ పండిట్‌కు ప్రతినెలా రూ.3,250 చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తున్నాం. అయితే ఒక్కో కుటుంబానికి ఈ నెలవారీ ఆర్థిక సాయం పరిమితి రూ.13వేలుగా ఉంటుంది. నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతాయి. ఉచిత రేషన్ సరుకులను కూడా ప్రతినెలా ఇస్తాం. కశ్మీరీ పండిట్ల కోసం 5,248 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించాం. మరో 6వేల తాత్కాలిక నివాసాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 4,112 తాత్కాలిక నివాసాల పనులు పూర్తయ్యాయి. కశ్మీరీ పండిట్లకు 6వేల ప్రభుత్వ ఉద్యోగాలను మంజూరు చేశాం. వీటిలో 5,896 ఉద్యోగాల భర్తీ ఇప్పటికే పూర్తయింది. వారి కోసం సామాజిక భద్రతా పథకాలను, స్కాలర్‌షిప్‌లను అమలు చేస్తున్నాం. కశ్మీరుకు తిరిగి వచ్చే కశ్మీరీ పండిట్ల సంక్షేమం విషయంలో రాజీపడేది లేదు" అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు.

**కశ్మీరీ పండిట్లు కశ్మీరును ఎందుకు వీడారు?**

1990వ దశకం ప్రారంభంలో జమ్మూ కశ్మీర్‌లో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం పెరిగిపోయింది. ప్రత్యేకించి 1989-1990 మధ్య కాలంలో జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) వంటి ఉగ్రవాద సంస్థలు కశ్మీరీ పండిట్లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశాయి. వందలాది మంది కశ్మీరీ పండిట్లు, ప్రముఖ పండిట్ నేతలను హత్య చేశాయి. 1990 జనవరి 19న రాత్రి శ్రీనగర్ వీధుల్లో జరిగిన హింసాత్మక నిరసనల వల్ల తమ ప్రాణాలకు రక్షణ లేదని భావించి వేలాది కశ్మీరీ పండిట్ల కుటుంబాలు రాత్రికి రాత్రే లోయను విడిచిపెట్టాయి. ఆనాడు తమ భూములు, ఇళ్లను వదిలేసి వాళ్లు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు.

## మోదీ- ట్రంప్ ఫోన్‌కాల్‌లో మస్క్ ఉన్నారా క్లారిటీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్? మధ్య ఇటీవల జరిగిన ఫోన్ సంభాషణపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఈ సంభాషణలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా పాల్గొన్నారన్న వార్తలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. మార్చి 24న జరిగిన ఈ ఫోన్ కాల్‌లో కేవలం మోదీ, ట్రంప్ మాత్రమే పాల్గొన్నారని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. "ఈ వార్త మా దృష్టికి వచ్చింది. ఆ రోజు జరిగిన ఫోన్ సంభాషణలో ఈ ఇద్దరు నేతలే ఉన్నారు. పశ్చిమాసియా పరిస్థితులపై అభిప్రాయాలు పంచుకోవడానికి అది ఒక అవకాశం మాత్రమే" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. ఇటీవల ఓ అంతర్జాతీయ మీడియా ప్రచురించిన కథనం ప్రకారం, మస్క్ ఆ కాల్‌లో పాల్గొన్నారని, ఇది యుద్ధ పరిస్థితుల్లో ఇద్దరు దేశాధినేతల మధ్య జరుగుతున్న కీలక సంభాషణలో ఒక ప్రైవేట్ వ్యక్తి పాల్గొనడం అరుదైన విషయం అని పేర్కొంది. అయితే ఈ వార్తలపై అధికారిక ప్రకటనల్లో ఎక్కడా మస్క్ ప్రస్తావన లేకపోవడం సందేహాలకు తావిచ్చింది. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం అధికారికంగా స్పందిస్తూ ఆ కథనాలను తోసిపుచ్చింది. మరోవైపు అమెరికా వైట్ హౌస్ కూడా ఈ విషయంపై స్పష్టంగా స్పందించకుండా, మోదీ-- ట్రంప్ మధ్య సంభాషణ ఉపయోగకరంగా జరిగిందని మాత్రమే పేర్కొంది. మోదీ- ట్రంప్? ఫోన్ కాల్ ప్రధానంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై జరిగింది. ముఖ్యంగా ఇరాన్- ఇజ్రాయెల్- అమెరికా మధ్య జరుగుతున్న ఘర్షణలు, సముద్ర మార్గాల భద్రత వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా ప్రపంచానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి పరిస్థితి పై ఇద్దరు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ మార్గం ద్వారా భారీగా చమురు, వాయువు రవాణా జరుగుతుంది. ప్రస్తుతం ఇరాన్ నియంత్రణ, యుద్ధ ప్రభావం కారణంగా ఈ మార్గంలో అంతరాయం ఏర్పడటంతో గ్లోబల్ మార్కెట్లపై ప్రభావం పడుతోంది. ఇంధన ధరలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, హర్మూజ్ జలసంధి ఎప్పటికప్పుడు తెరిచి ఉండాలని, అది భద్రంగా, అందుబాటులో ఉండటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అత్యంత అవసరమని మోదీ తన అభిప్రాయం వెల్లడించారు. ఫోన్ కాల్ అనంతరం మోదీ ఎక్స్?లో చేసిన పోస్టులో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. "పశ్చిమాసియా పరిస్థితులపై ట్రంప్‌తో మాట్లాడాను. ఉద్రిక్తతలు తగ్గి శాంతి నెలకొనాలని భారత్ కోరుకుంటోంది. హర్మూజ్ జలసంధి భద్రత ప్రపంచానికి కీలకం" అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అమెరికా తరఫున ఇరాన్‌తో చర్చలు జరగవచ్చని సంకేతాలు వెలువడుతున్నాయి. ట్రంప్ ప్రత్యేక దౌత్య ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ మాట్లాడుతూ, ఇరాన్ ఈ వారం చర్చలకు ముందుకు రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికకు ఇరాన్ స్పందిస్తే సమస్యలు పరిష్కారం కావచ్చని తెలిపారు.

# ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మెట్రో విస్తరణకు ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్ మెట్రోరైలును ప్రభుత్వం తీసుకునేందుకు ఉద్దేశించిన తీర్మానాన్ని శాసన సభ ఆమోదించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులు తొలగించేందుకే ప్రభుత్వం మెట్రోరైల్‌ను స్వాధీనం చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు తీర్మానం పెట్టిన తర్వాత వివరించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మెట్రో విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులపై సమీక్షించామని అన్నారు. ప్రస్తుతం 69 కి.మీ. మెట్రో నిర్మాణం జరిగిందని చెప్పారు. మెట్రో ఫేజ్-2ఏ కింద 76.4 కి.మీ, మెట్రో ఫేజ్-2బీ కింద 86.1 కి.మీ మేర నిర్మాణం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. మెట్రో విస్తరణపై సీఎం అసెంబ్లీలో ప్రసంగించారు.



"మెట్రో విస్తరణ జరగాలంటే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి విస్తరించాలి. విస్తరణకు అవసరమైన విధివిధానాలను, కార్యాచరణను ముందుకు తీసుకువెళ్లాలి అంటే ఫేస్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నం అయ్యాయి. అందుకోసం మెట్రో-1 ఎల్అఎన్ టీ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటానికి అవసరమైన తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టాను. సభ్యులందరినీ ఏకాగ్రీవంగా ఈ తీర్మానాన్ని ఆమోదించవల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. అలాగే ఫేస్-2 విస్తరణకు త్వరగా ఆమోదం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలని కోరుకుంటున్నాం" - రేవంత్ రెడ్డి, సీఎం

మెట్రో ఫేజ్-1 నుంచి వైదొలిగేందుకు ఎల్ అండ్ టీ ఒప్పుకుంది : మెట్రో ఫేజ్?-1 నుంచి వైదొలిగేందుకు ఎల్? అండ్ ?టీ అంగీకరించిందని మంత్రి శ్రీధర్?బాబు తెలిపారు. మెట్రో రెండో దశలో పాల్గొనాలని ప్రభుత్వం కోరిందని, మెట్రో ఫేజ్?-2ఏ, బీలో పాల్గొనేందుకు ఎల్?అండ్?టీ సుముఖంగా లేదని మంత్రి తెలిపారు. "మెట్రో రెండో దశలో పాల్గొనాలని ఎల్ అండ్ టీని ప్రభుత్వం కోరింది. మెట్రో ఫేజ్-2ఏ, బి పాల్గొనేందుకు ఎల్ అండ్ టీ సుముఖంగా లేదు. మెట్రో ఫేజ్-1 నుంచి వైదొలిగేందుకు ఎల్ అండ్ టీ ఒప్పుకుంది" - శ్రీధర్?బాబు, మంత్రి

# అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్

-మొదటిపేజీ తరువాయి

దయాకర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



**న్యూట్రిషన్ ఫుడ్ అందడం లేదు**

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ఈ పథకం ప్రారంభోత్సవానికి ఒక మంచి నేపథ్యం ఉందని గుర్తు చేశారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని ఎడ్యుకేషన్, ఇరిగేషన్?కు ప్రాధాన్యత ఇచ్చారని, దేశంలో ప్రస్తుతం ఫుడ్ సెక్యూరిటీ ఉందని, కానీ న్యూట్రిషన్ ఫుడ్ అందడం లేదని తెలిపారు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోందని అన్నారు. ఇప్పుడు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించామని పేర్కొన్నారు.

**ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తాం**

ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా, అమలు చేయాల్సింది అంగన్‌వాడీ టీచర్లు మాత్రమేనని, అందుకే ప్రభుత్వం వారిపై గురుతర బాధ్యత పెట్టిందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని, వారికి పౌష్టికాహారం అందించాలని కోరారు. అంగన్?వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందన్న ఆయన, ఆ శాఖ సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని, ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా వారి సమస్యలనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

**అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు**

ఈ క్రమంలోనే అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని, సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే వారిలో మానసిక ఎదుగుదల ఉంటుందని, పౌష్టికాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. భవిష్యత్?లో అవే అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయని అన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు.

"దేశంలో ప్రస్తుతం ఫుడ్ సెక్యూరిటీ ఉంది. కానీ పౌష్టికాహారం అందట్లేదు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోంది. అంగన్?వాడీ సిబ్బంది సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్?వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలి. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుంది. పౌష్టికాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి"

# అమరావతికి చట్టబద్ధత..

-మొదటిపేజీ తరువాయి

కార్యదర్శి, ఏపీ సీఎస్ కు పంపిన అసెంబ్లీ సెక్రటరీ జనరల్. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. అమరావతి నిర్మాణ బాధ్యతను పార్లమెంటు తీసుకుంటుందని ప్రధాని భరోసా ఇచ్చారు. రైతులు ఇచ్చింది భూములు కాదు రాష్ట్రానికి భవిష్యత్తును ఇచ్చారు. సెల్ఫ్ సస్టైన్ ప్రాజెక్టుగా అమరావతి నిర్మితం అవుతుందని చెప్పాం.. అదే జరిగి తీరుతుంది. రాజధాని వల్ల ఏం జరుగుతుందనే వ్యక్తులు హైదరాబాద్ నుంచి ఏడాదికి 1.05 లక్ష కోట్ల మేర వస్తున్న ఆదాయం చూడాలి. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రాంతంగా అమరావతి ఉంటుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయి. 2019లో ఒక్కఛాన్స్‌తో ప్రజావేదిక కూల్చి విధ్వంస పాలన మొదలు పెట్టారు. 30 ఏళ్లు వెనక్కు వెళ్లింది. రైతులపై ఉక్కు పాదం మోపారు, కేసులు, బూట్లు, లాఠీలతో తన్నులు, అడ్డగోలు కేసులు, కీచకపర్వం చేశారు. శాసన మండలిలో సెలెక్ట్ కమిటీతో బిల్లు పాస్ చేయాలని చూశారు. అయినా హైకోర్టు కాపాడింది. ఈ తరహా పాలన తుగ్లక్ నిర్ణయం అని, పెట్టుబడులు రావని మీడియా పెద్ద ఎత్తున రాసింది. గత పాలనలో నేను, పవన్ కల్యాణ్ సహా అంతా బాధితులమే. కూటమిగా ఏర్పడి 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం. కేంద్రం రూ.15వేల కోట్లు తక్షణం అందించింది. అమరావతి పనులు రీస్టార్ట్ చేశాం. 2028కి పనులు అన్నీ పూర్తి చేసి అమరావతికి ఓ షేప్ తీసుకువస్తాం. 2027 నాటికి ట్రంక్ రోడ్లు, లేఅవుట్స్ సహా వివిధ మౌలిక సదుపాయాలు పూర్తి అవుతాయి. రూ.56 వేల కోట్ల విలువైన 91 పనులు వేగంగా జరుగుతున్నాయి.

వైసీపీ బుద్ధి ఇంకా మారలేదు. అవే కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. రాజ్యాంగంలో రాజధాని అనే పేరే లేదంటారు. వీళ్లకు ఓ ప్రత్యేకమైన రాజ్యాంగం ఉందా? రాజారెడ్డి రాజ్యాంగాన్ని వీళ్లు అనుసరిస్తారు. దేశం అనుసరించేది అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే.

ఏపీకి ఒక్కటే రాజధాని.. అది అమరావతి మాత్రమే. అదే శాశ్వతం. రాజధానిని ఎవరూ టచ్ చేయలేరు, ఇంచ్ కూడా కదలదు. రాజధానిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాని వచ్చిన సమయంలో ఓమారు, ఆ తర్వాత మరోమారు, రెండు రోజుల క్రితం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిస్తున్నాను. అమరావతి ఆంధ్రప్రదేశ్ గుండె, ఆంధ్రప్రదేశ్ ఆత్మ, ఆమరావతి అందరిదీ అనేలా ఈ నగర నిర్మాణం చేస్తాం. హైదరాబాద్, అమరావతి రెండు నగరాలు అభివద్ధికి చిరునామాలుగా మారాలి. భవిష్యత్ నగరం అమరావతి, బ్లూ, గ్రీన్ నగరంగా ఇది నిర్మితం అవుతుంది. దేశం గర్వించేలా అమరావతిని నిర్మించి తీరుతాం. ఒకే రాజధాని అభివద్ధి మాత్రం అన్ని ప్రాంతాలకూ విస్తరిస్తాం. మూడు రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివద్ధి చేస్తాం, విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లు విస్తతంగా అభివద్ధి అవుతాయి. అమరావతి అజేయం, అమరావతి అద్భుతం, అమరావతితోనే తెలుగు వైభవం. ఈ తీర్మానానికి మద్దతు పలికిన అందరికీ ధన్యవాదాలు తెలియచేస్తున్నాను అని శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.


# వైఎస్సార్సీపీ మళ్లీ రాదు.. వచ్చినా ఏం చేయలేదు

-మొదటిపేజీ తరువాయి

కక్ష గట్టిన జగన్ మహిళల్ని రోడ్లపైకి ఈడ్చారని ఆరోపించారు. మహిళలకు మద్దతుగా అమరావతి వెళ్తే ముళ్ల కంచెలు వేసి అడ్డుకున్నారని తెలిపారు. అప్పట్లో అమరావతి చాలా ఆందోళనగా ఉండేదని గుర్తు చేశారు. చట్టసభలోని సభ్యులకే రక్షణ లేకపోతే బయటి ప్రజల పరిస్థితి గురించి ఏం చెబుతామని పవన్ ఆరోపించారు. జగన్ చేసిన అన్యాయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అమరావతి ఏపీకి ఏకైక రాజధానిగా ఉంటుందని చెప్పామని, ప్రజలు అర్థం చేసుకుని కూటమిని గెలిపించారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకునే క్రమంలో అడుగు పడిందని తెలిపారు. చట్టసభలో ఇచ్చేది కేవలం హామీ కాదని, చిత్తశుద్ధితో అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

**ఒకటే నేల, ఒకటే రాష్ట్రం, ఒకటే జాతి**

భూమి ఇచ్చిన చిన్న రైతులతో పాటు మిత్తల్ వంటి పారిశ్రామికవేత్తలు కూడా స్థిరత్వం అడుగుతున్నారని, మనం ఐక్యంగా ఉంటేనే ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని పవన్ కల్యాణ్ గట్టిగా చెప్పారు. మనం ప్రాంతీయ భావనలు పక్కన పెట్టి ఆంధ్రా అని చెప్పుకుందామని, ఒకటే నేల, ఒకటే రాష్ట్రం, ఒకటే జాతి అని బలంగా చెప్పాలని పిలుపునిచ్చారు. ఇక్కడ ఎవరికి డబ్బులు ముఖ్యం కాదని, ఎవరి ఆదాయమార్గాలు వారికున్నాయని చెప్పారు. నేరమయ రాజకీయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని, అప్పుడే ఏపీకి పెట్టుబడులు బలంగా వస్తాయని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.



హైదరాబాద్ అభివృద్ధిని స్వయంగా చూశామని, చంద్రబాబుని అప్పుడు కొందరు విమర్శించినా ఇప్పుటి తరం ఆనాటి పనుల ఫలితాన్ని అనుభవిస్తోందని వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ గతంలో ఉండేవని సైబరాబాద్ మాత్రం చంద్రబాబు సృష్టించిన నగరమని కొనియాడారు. ఇలాంటి నమ్మకంతోనే అమరావతి శాశ్వత రాజధాని అన్న తీర్మానానికి సంపూర్ణ మద్దతిస్తున్నట్లు చెప్పారు. "పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితం వల్ల ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైంది. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకుంటున్నాం. ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేదని తలుచుకుంటే బాధేస్తోంది. రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు, ఆంధ్ర వేరు అనే భావన లేదు తెలుగునేల అనే భావన ఉండేది. రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాష్ట్రం ఏర్పడే నాటికి సరైన కార్యాలయాలు లేవు. చంద్రబాబు బలమైన ఆశావాది కాబట్టి, కార్యాలయాలు లేకపోయినా పనిచేశారు. టెంట్ వేసుకొని అయినా పని చేద్దామని చంద్రబాబు ఆశించారు.

ఏపీపై ఉన్న గౌరవం వల్లే 2014లో చంద్రబాబుకు మద్దతు ఇచ్చాను. చంద్రబాబు లాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటే బాగుంటుందని మద్దతు ఇచ్చాను. రాజధాని కోసం మెజార్టీ రైతులు ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా 33 వేల ఎకరాలు రాజధాని కోసం సేకరించారు. 2019లో ప్రభుత్వం మారాక అమరావతిపై కక్ష కట్టారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వైఎస్సార్సీపీ హయాంలో హింసించారు" అని పవన్ కల్యాణ్ మండిపడ్డారు.

## అక్రమ మైనింగ్‌లపై సభలో దుమారం

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అనుమతులు లేకుండా క్రషర్స్ నడుపుతోందని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించి మైనింగ్ చేపడుతున్నా ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. రక్షకులే భక్షకులయ్యారని ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తున్న అంశంపై సభాసంఘం వేయాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు వ్యాఖ్యలను తప్పుపట్టిన మంత్రులు శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ పొంగులేటి పేరు ప్రస్తావించడాన్ని తప్పుపట్టారు. పదేళ్లలో ఇసుక, ఇతర మైనింగ్‌లో జరిగిన అక్రమాలపైనా నజర్ పెట్టాలని అమాత్యులు సూచించారు. మొత్తం వ్యవహారంపై శాఖాపరమైన విచారణ చేపడతామని గనుల శాఖ మంత్రి వివేక్ ప్రకటించారు.

**సీబీసీఐడీ విచారణకు ఆదేశం**

మంత్రుల సమాధానాలతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ శాసనసభ్యులు అసెంబ్లీ వెల్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విజ్ఞప్తి చేసినా శాంతించకపోవటంతో జోక్యం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా పదేళ్లలో అక్రమ మైనింగ్ చేపట్టిన సంస్థల అవినీతిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి పొంగులేటికి రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థతో సంబంధంలేదని సీఎం స్పష్టం చేశారు.

**నిరసన మధ్యే పద్దులకు శాసనసభ ఆమోదం**

పద్దులపై చర్చ, మంత్రుల సమాధానం పూర్తయినట్లు ప్యానల్ స్పీకర్ ప్రకటించారు. 8 పద్దులకు శాసనసభ ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్ సభ్యుల నిరసన మధ్యే పద్దులకు ఆమోద ముద్ర వేసింది. 2025-26 అదనపు వ్యయ అంచనాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. అనంతరం శాసన సభ రేపటికి వాయిదా పడింది.

"అక్రమ మైనింగ్ విచారణకు ఈ ప్రభుత్వం సిద్ధం. గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్ర మైనింగ్‌పై విచారణ జరిపించేందుకు సిద్ధం. నేరెళ్లలో ఇసుక అక్రమాలు, ఎస్సీలపై చేసిన దాడులపై విచారణ జరిపిస్తాం. గతంలో మైనింగ్‌శాఖను పదేళ్లపాటు కేటీఆర్ తను గుప్పిట్లోనే పెట్టుకున్నారు. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. దాడులు చేయించి వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. హరీశ్‌రావు సోదరుడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారు. మేం నిజాయతీగా పనిచేస్తూ మైనింగ్ ఆదాయం పెంచాం. ఆదాయ పంపకాల్లో తేడాలు వచ్చి సొంత సోదరినే బయటకు పంపారు. సోదరుల వ్యాపారాలతో మంత్రి పొంగులేటికి ఎలాంటి సంబంధం లేదు"

## ఇందిరమ్మ ఇళ్ల కోసం ఏఐ టెక్నాలజీ

-మొదటిపేజీ తరువాయి

దానిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఊరూరా ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఏఐ సాంకేతిక సహాయం చేస్తోంది. అనర్హులైన వారి పేర్లను ఇట్టే పసిగట్టేస్తుంది. ఈ విధంగా ప్రతి జిల్లాకు ఈ ఏఐని ఉపయోగిస్తున్నారు.

**కామారెడ్డిలో పరిస్థితి ఇలా :** కామారెడ్డి జిల్లాలో కొందరు వ్యక్తులు వారి పలుకుబడితో ఇళ్లు మంజూరు అయ్యేలా చేసుకుంటున్నారు. అయితే మొదట ఈ జిల్లాలో దాదాపు 675 మంది అనర్హులు ఉన్నట్లు ఏఐ ద్వారా తేలింది. అధికారులు వెంటనే వారి జాబితాను జిల్లాకు పంపించారు. జిల్లాలోని అధికారులు ఆ జాబితాను పరిశీలించి వారిలో 428 మంది లబ్ధిదారులు అనర్హులని తేల్చి నివేదిక ఇచ్చారు. మొత్తంగా చూసుకుంటే ఈ జిల్లాలో వంద మంది వరకు అనర్హులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు మొత్తం 12,021 ఇళ్లు మంజురయ్యాయి. వాటిలో ముగ్గుపోసినవి 10,222 ఉన్నాయి. బేస్?మెంట్? స్థాయి వరకు నిర్మించిన ఇళ్లు 2868 ఉన్నాయి. రూఫ్?స్థాయి వరకు కట్టినవి 1007 ఇళ్లు. 333 ఇళ్లు స్లాబుస్థాయి వరకు పూర్తయ్యాయి. ఇక మొత్తానికే నిర్మించిన ఇళ్లు 292.

**గతంలో లబ్ధి పొందినవారికి మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు :** కేవలం ఇళ్లు లేని వారికోసమనే ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. అయితే ఇల్లు, కారు, ఇతర వాహనాలు ఉన్నవారు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. నిజానికి గ్రామస్థాయిలోని అధికారులు అన్ని చెక్? చేసి అర్హులైన వారి వివరాలు మాత్రమే పంపించాలి. కానీ క్షేత్రస్థాయిలో వేరేలా జరిగింది. కొందరు కమీటీ సభ్యులు చూసిచూడనట్టుగా వ్యవహరించారు. దీంతో ఇల్లు, కారు, ఇతర వాహనాలు ఉన్నవారు కూడా జాబితాలో కలిసిపోయారు. ఇక ఇలాంటి బోగస్?లకు చెక్? పెట్టేందుకు ప్రభుత్వం బిల్లులు జారీ చేసేటప్పుడు ఏఐని వాడింది. దీని ద్వారా ప్రతి గ్రామాన్ని జల్లెడ పట్టారు. ఇప్పటి వరకు ఏఐ పట్టుకున్న వారికి కార్లు, ఇళ్లు ఉన్నట్లుగా రికార్డుల్లో ఉంది. అయితే దీంట్లో గత ఇందిరమ్మ పథకంలో లబ్ధి పొందినవారే మళ్లీ తీసుకున్నట్లు తేలింది.

**అనర్హులుగా తేలిన వారి మొర ఇదే**

ఏఐ సాంకేతికతను ఉపయోగించి ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులని తేల్చి చెప్పిన వారి మొర వేరేలా ఉంది. బోగస్ లబ్ధిదారులుగా తేలినవారంతా పేదవాళ్లమనే అంటున్నారు. వారికి ప్రస్తుతం ఇల్లే లేదంటూ అధికారులు ముందు మొత్తుకుంటున్నారు. జీవనోపాధి కోసమని కొంతమంది వాహనాలను ఉపయోగిస్తున్నారు. అవి వారి సొంత వాహనాలుగా ఏఐ గుర్తించింది. అలాగే మరికొంతమందికి పాత ఇళ్లు వారి పేరిట రికార్డుల్లో ఉండడంతో ఏఐ పట్టుకుంటోంది. కొంతమంది ఇందిరమ్మ ఇళ్లకోసమని శిథిలావస్థలో ఉన్న వాటిని కూల్చివేశారు. వారికి అనుకున్నట్టుగానే ఇల్లు మంజురైంది. కానీ ఇక్కడే వచ్చింది అసలు సమస్య. ఏఐ వారికి గతంలోనే ఇళ్లు ఉన్నట్లు చూపిస్తుంది. ఈ సమస్యను పరిష్కరించ టానికి క్షేత్రస్థాయిలో గమనించిన విషయాలను అధికారులు నివేదిక రూపంలో కలెక్టర్ ద్వారా రాష్ట్ర స్థాయికి పంపిస్తున్నారు. ఆ తర్వాత లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తున్నారు.

## పొరపాటున ఏ తుగ్లక్ వచ్చినా అమరావతిని మార్చలేరు

-మొదటిపేజీ తరువాయి

సమాన దృష్టితో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. మళ్లీ జగన్ మాయలో పడవద్దని ప్రజలకు సూచించారు. రాజధాని అమరావతి వల్ల ఎంతోమంది జీవితాలు మారాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాజధాని భూముల ధరలు పెరిగాయన్నారు. ప్రపంచమే ఆశ్చర్యపోయేలా రాజధాని నిర్మించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారని తెలిపారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరే తీర్మానంపై చర్చ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. అభివృద్ధిలో ఒకప్పుడు అనంతపురం చివరి స్థానంలో ఉండేదని, కియా పరిశ్రమ వచ్చాక, అనంతపురం 5వ స్థానంలోకి వచ్చిందని గుర్తు చేశారు. హార్టికల్చర్ ద్వారా సీఎం చంద్రబాబు రాయలసీమను అభివృద్ధి చేశారని, ఉత్తరాంధ్రకు అనేక పరిశ్రమలను తీసుకొచ్చారని మంత్రి లోకేశ్ అన్నారు. ఎన్నికలకు ముందు రాజధానిగా అమరావతి ఉంటుందని జగన్ ప్రకటించారు. అయితే ఎన్నికల్లో 151 సీట్లు గెలిచిన తర్వాత, రాజధానిపై ప్లేటు ఫిరాయించారన్నారు. మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడారని మంత్రి లోకేశ్ జగన్?పై మండిపడ్డారు. మూడు రాజధానుల బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపినందుకు మమ్మల్ని దూషించారని, ఉత్తరాంధ్రకు జగన్ ఏమైనా చేశారా? అని లోకేశ్ ప్రశ్నించారు. జగన్ ఉండేందుకు ఒక ప్యాలెస్ కట్టుకున్నారని, అమరావతి రైతులకు అబద్ధం చెప్పినందుకు జగన్ క్షమాపణ చెప్పాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు.

"అమరావతి కోసం రైతులు పోరాడారు. ఎప్పుడూ గడప దాటని మహిళలు కూడా పోరాడారు. రాజధానిలో తిరగాలంటే జగన్ పరదాలు కట్టుకుని తిరిగేవారు. తప్పు చేశానని జగన్?కు తెలుసు కాబట్టే, పరదాల చాటున తిరిగారు. ఆందోళన చేస్తున్న మహిళలను జుట్టుపట్టుకొని లాగారు. ఒకే రాష్ట్రం - ఒకే రాజధాని అభివృద్ధి వికేంద్రీకరణే మా విధానం. రైతుల పోరాటాలను కవరేజ్ చేస్తున్న ఈటీవీ విలేఖరి పై రేప్ కేసు పెట్టారు. అమరావతి రైతులకు అండగా నిలబడిన మమ్మల్ని దూషించారు. వైఎస్సార్సీపీ హయాంలో చంద్రబాబు పై దాడి చేసేందుకు కూడా యత్నించారు"

ఇప్పటికీ పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారు: భూమిపై ఎవరూ శాశ్వతం కాదు. వ్యవస్థలే శాశ్వతం. చంద్రబాబు తర్వాత వచ్చిన సీఎంలందరూ హైదరాబాద్?ను అభివృద్ధి చేశారు. 2019లో వచ్చిన జగన్ మాత్రం రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు చాలా సంస్థలు భయపడుతున్నాయి. మళ్లీ జగన్ వస్తే పరిస్థితి ఏంటని పారిశ్రామిక వేత్తలు అడుగుతున్నారు. ఏపీకి ప్రస్తుతం 25 శాతం పెట్టుబడులు వస్తున్నాయి.

## సంపాదకీయం

# డాలర్‌తో రూపాయి విలవిల

భారత బడా బూర్జువా వర్గం, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలక ప్రభుత్వాలు సామ్రాజ్యవాదంతో రాజీపడి దేశ సహజ వనరులను కట్టబెట్టటమేకాక, దేశ కరెన్సీ అయిన రూపాయి విలువను కూడా అమెరికా సామ్రాజ్యవాదుల దయకు వదిలివేశారు. దాని ఫలితమే రూపాయి విలువ పతనమై నేడు డాలర్‌కి 94.84 రూపాయలుగా ఉంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి నిదర్శనం. అధికార మార్పిడి జరిగిన తర్వాత 1947లో ఒక డాలర్‌తో రూపాయి మారకం విలువ 3.50 ఉంది. 1948 నుండి 1980 వరకు కొంచెం అటుయిటుగా ఉంది. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైనతర్వాత రూపాయి విలువ పతనం ఎక్కువగా జరిగింది. అధికార మార్పిడి దగ్గర నుంచి 2022 వరకు రూపాయి విలువ 79 సార్లు పడిపోయింది. ప్రపంచ చమురు వినియోగించే దేశాల్లో 3వ స్థానంలో ఉన్న భారత్‌కు 85% చమురు దిగుమతిగా ఉంది. చమురే కాకుండా ఫార్మా, టెక్నాలజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ తదితర రంగాలకు అవసరమైన ముడిసరుకులు, వంటనూనెలు, ఆహారధాన్యాలు, పప్పులు, లోహాలను భారతదేశం దిగుమతి చేసుకుంటున్నది. ఈ దిగుమతులకు చెల్లింపులు డాలర్ల లోనే జరపాలి. రూపాయి విలువ తగ్గిన ప్రతిసారి దిగుమతుల కోసం చెల్లించాల్సిన మొత్తం పెరుగుతూ ఉంటుంది. రూపాయి విలువ పడిపోవటంవల్ల దిగుమతి అయ్యే అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. ధరల పెరుగుదల భారం ప్రజలపైనే పడుతుంది. డీజిల్ ధరలు పెరిగితే రవాణా చార్జీలు పెరిగి ఉప్పు, పప్పు, ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయి. అంతేకాకుండా ప్రయాణ ఖర్చులు, ఆటో చార్జీలు, బట్టలు, పిల్లల స్కూలు ఫీజులు, ఫోన్లు, టివిలు, ల్యాప్ టాపుల, వాహనాల ధరలు పెరుగుతాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతుంది. రూపాయి పతనం ఫలితంగా బడ్జెట్ లెక్కలు, అంచనాలు మారిపోతాయి. విదేశాలకు ఎగుమతి చేసే వారికి మాత్రం ఆదాయం పెరుగుతుంది. ప్రపంచ దేశాలపై ఏ దేశ పెత్తనం ఉంటుందో, ఆ దేశ కరెన్సీ ఆధిపత్యం చలాయిస్తుంది. 1947 దాకా ప్రపంచ ఆధిపత్యం బ్రిటన్ చేతుల్లో ఉంది.

దాని ఫౌండ్ కరెన్సీ, ఇతర దేశాల కరెన్సీపై ఆధిపత్యం చలాయించింది. బ్రిటన్ బలహీన పడిన తర్వాత అమెరికా ప్రపంచ పోలీసుగా వ్యహరిస్తూ, తన డాలర్ కరెన్సీ ఆధిపత్యాన్ని ఇతర దేశాలపై నెలకొల్పింది. చమురును డాలర్లలో చెల్లించాలనే ఒప్పందం కుదరటానికి ముందు అమెరికా కరెన్సీ విలువ ఆ దేశం వద్ద నున్న బంగారం నిల్వలతో ముడిపడి ఉంది. 1974లో సౌదీ అరేబియా తదితర దేశాలు చమురు ఉత్పత్తిని పరిమితం చేయటంతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి. దీంతో అమెరికా రంగంలోకి దిగింది. సౌదీ అరేబియా డాలర్ల లోనే చమురు అమ్మకాలు జరపాలని, మిగులు ఆదాయాన్ని అమెరికా ప్రభుత్వ బాండ్లలో మదుపు చేయాలని, దానికి బదులుగా సైనిక, ఆర్థిక సహాయం అందిస్తామని ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా సౌదీ అరేబియాను తన వ్యూహంలో అమెరికా ఇరికించింది. అప్పటి నుండి చమురు ఉత్పత్తి దేశాల్లో డాలర్లలోనే చమురు విక్రయం కొనసాగింది. ముడి చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలరు ప్రాధాన్యత బాగా పెరిగింది. ముడి చమురుకు అన్నిదేశాలు డాలర్లలో చెల్లించాల్సి వచ్చింది. ఫలితంగా ప్రపంచ వాణిజ్యంలో డాలర్ ప్రాచుర్యం పొందింది. వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు బ్రెజిల్, రష్యా, చైనా, భారత్, దక్షిణాఫ్రికా దేశాలు బ్రిక్స్ దేశాల కూటమిగా ఏర్పడ్డాయి. ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ ఎమిరేట్ సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇంకా 30 దేశాలు బ్రిక్స్‌లో చేరాలనే ఆలోచన చేస్తున్నాయి. ఐఎంఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఆర్థిక వ్యవస్థ దీని ఏర్పాటు లక్ష్యం. అంతర్జాతీయ వాణిజ్యం ఆయా దేశాల కరెన్సీలలోనే జరగాలనే డిమాండ్ ను బ్రిక్స్ ముందుకు తెచ్చింది. బ్రిక్స్ దేశాల జనాభా 310 కోట్లకు పైగా ఉంది. ఇది ప్రపంచ జనాభాలో 41%, ప్రపంచ వ్యవసాయంలో 45% కలిగి ఉన్నాయి. బ్రిక్స్ దేశాలు, తమ ద్వైపాక్షిక సంబంధాల్లో జోక్యం చేసుకోని, సమానత్వంతో కూడిన, పరస్పర ప్రయోజనాల ఆధారంగా నిర్వహించు కుంటాయి. అంతర్జాతీయ బ్యాంకులకు దీటుగా ప్రత్యేక అభివృద్ధి బ్యాంకును నెలకొల్పేందుకు బ్రిక్స్ దేశాలు సన్నద్ధ మవుతున్నాయి. వీటి ప్రయోజనాలు వీటికి ఉన్నా, అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకోగలిగితే ప్రపంచ వాణిజ్యంలో మార్పులు సంభవిస్తాయి. డాలర్ ఆధిపత్యాన్ని సహించని రష్యా, చైనాలు డాలర్‌కి ప్రత్యామ్నాయంగా ఆ దేశాల కరెన్సీలోనే చెల్లింపులు జరపాలని నిర్ణయించాయి. బ్రిక్స్ వేదికగా సమర శంఖం పూరించాయి. పెట్రోల్ విక్రయంలో డాలర్‌కు సౌదీ అరేబియా స్వస్తి చెప్పటం బ్రిక్స్‌కి బలం చేకూరుతుంది. ఇక నుంచి డాలర్లతో పాటు చైనా యువాన్, ఐరోపా సమాఖ్య (ఇయు) యూరో, జపానీస్ యెన్‌లలోను చెల్లింపులు స్వీకరిస్తామని చెప్పింది. వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు కలసి ఉమ్మడి కరెన్సీ వెలువరించే ప్రయత్నంలో ఉన్నాయి. ఆ కరెన్సీ స్వభావం గురించి ఉమ్మడి అభిప్రాయ రావాల్సి ఉంది. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వాణిజ్యం జరగాలన్న అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో, అలా వ్యతిరేకిస్తున్న దేశాలను బెదిరించటానికి ట్రంప్ పూనుకున్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై 100% సుంకాన్ని విధిస్తామనే బెదిరింపులు చేస్తున్నాడు. ట్రంప్ బెదిరించగానే ప్రపంచంలో మూడవ అతిపెద్ద 'ఆర్థిక' వ్యవస్థగా చెప్పుకుంటున్న భారతదేశం డాలర్ రహిత వాణిజ్యంపట్ల ఆసక్తి లేదని ప్రకటించటం అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ లొంగుబాటును వెల్లడి చేస్తున్నది. భారత రూపాయి విలువ పతనానికి అధికార మార్పిడి జరిగిన దగ్గర నుంచి నేటి వరకు పాలక ప్రభుత్వాలు అనుసరించిన, అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలతో, డాలర్ ఆధిపత్యాన్ని వ్యతిరేకించకపోవటం, దేశం స్వయం సమృద్ధిని సాధించే విధానాల అనుసరించకపోవటం, పెద్ద ఎత్తున చేసిన విదేశీ అప్పులకు డాలర్ల రూపంలో చెల్లించటమే కారణం. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించటం ద్వారానే రూపాయి పతనం ఆగుతుంది.

# బ్రిటీష్ పాలకుల ఆజ్ఞలను ధిక్కరించిన తొలి సైనికుడు



బ్రిటిష్ రాచరిక నిరంకుశ పాలనను, పక్షపాత ధోరణిని, పంటి బిగువున భరిస్తూ, ఎదురించలేక తలవంచుకుని బానిసలుగా బతుకుతున్న భారతీయుల నిస్సత్తువకు నూతన శక్తిని ప్రసాదించి, ఆలోచనలను స్వేచ్ఛాస్వాతంత్ర్యాల వైపుకు మళ్లించిన స్వేచ్ఛా ప్రియుడు మంగళ్ పాండే. మూడు పదుల వయసు చూడ కుండానే ప్రాణ త్యాగానికి సిద్ధపడి, ఉరి కంబాన్ని ముద్దాడిన యువ కిషోరం పాండే. 1857 నాటికి యావద్భారతాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్న బ్రిటీష్ పాలకుల ఆజ్ఞలను ధిక్కరించి . ఆ కొసలో సిపాయిల తిరుగుబాటుగా చరిత్ర పుటల్లో నిలిచిన. ప్రప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంకు బీజం వేసి, ధిక్కార స్వరాన్ని వినిపించి, సంగ్రామానికి మీసాన్ని మెలితిప్పి, చావు తప్పదని తెలిసి, మొక్కవోని ధైర్య సాహసాలను ప్రదర్శించి, భారత జాతికి మార్గదర్శకునిగా నిలిచిన మేరు నగ ధీరుడు మంగళ్ పాండే. 1857, మార్చి 29... భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మరచి పోలేని దినం. ప్రాణాలను పణం గా పెట్టి, బ్రిటీష్ పాలకుల ఆజ్ఞలను ధిక్కరించిన తొలి సైనికుడుగా మంగళ్ పాండే చరిత్ర పుటల్లో చేరిన రోజు. బెంగాల్ నేటివ్ ఇన్ ఫాంట్రీ లో ఒక సాధారణ సిపాయిగా పనిచేసిన మంగళ్ పాండే 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటాని నాంది పలికాడు. 1827, జూలై 19న ఉత్తరప్రదేశ్ లోని బలియా జిల్లా నాగ్వ గ్రామంలో జన్మించి, 34 వ బ్రిటీష్ బెటాలియన్ లో పనిచేసిన అతిచిన్న వయస్సు గల బ్రాహ్మణ యువకుడు మంగళ్ పాండే, తూటాని వినియోగించేది లేదని తేల్చి చెప్పేశాడు. దూషణకు దిగిన సైనికాధికారి లెఫ్టినెంట్ బాగ్‌ని మంగళ పాండే కాల్చి చంపేశాడు. దీంతో క్రమశిక్షణ చర్యల కింద పాండేని ఆంగ్లేయులు ఉరి తీశారు. అలా 1857, మార్చి 29న కలకత్తాలో బ్రిటీష్ సార్జెంట్ పై మంగళ్ పాండే దాడిచేయడంతో సిపాయిల తిరుగుబాటుకు నాంది పలికింది. భారతీయుల్లో బానిసత్వ భావాన్ని పారద్రోలుతూ.. స్వాతంత్ర్య కాంక్షని ఉవ్వెత్తున రగిలించిన తొలి ఉద్యమం 1857 సిపాయిల తిరుగుబాటు. అప్పటి వరకు బ్రిటీష్ పాలకుల అజమాయిషీని భరిస్తూ, సామాజిక వివక్ష, లెక్కలేనన్ని అవమానాలు, అంగీకరించలేని స్థాయిలో అసమానతలను సైతం పంటిబిగువన భరిస్తూ వచ్చిన భారతీయ సిపాయిలు.. చివరికి తమ మనోభావాలను దెబ్బతీసేందుకు బ్రిటీషర్లు ప్రయత్నించడంతో తిరగబడ్డారు. ఈ తిరుగుబాటు భారతదేశ స్వాతంత్ర్య పోరాట గతి రీతినే సమూలంగా మార్చేసింది. బ్రిటీష్ పాలకుల పక్షపాతం సిపాయిల్లో తిరుగుబాటు జ్వాల రగిలించింది. 1856లో లార్డ్ కానింగ్ ప్రవేశపెట్టిన జనరల్ బ్రిటీష్ ఎన్‌లిస్ట్‌మెంట్ యాక్ట్ ప్రకారం సిపాయిలు బ్రిటీష్ పాలనలోని ఏ దేశంలోనైనా విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. దీంతో కొంతమంది హిందువులు ఈ యాక్ట్‌పై నిరసన తెలిపారు. అలాగే 1856లోనే రాయల్ కంపెనీ ఎన్‌ఫీల్డ్ తుపాకుల్ని సైన్యంలోకి ప్రవేశ పెట్టింది. వీటిల్లో వినియోగించే తూటాలను సిపాయిలు నోటితో కొరికి అమర్చాల్సి ఉండేది. కానీ.. ఈ కొరకాల్సిన భాగంలో ఆవు, పంది కొవ్వుని పూశారనే వదంతి అంతటా వ్యాపించింది. దీంతో ఆవును పవిత్రంగా భావించే హిందువులతో పాటు.. పందిని అపవిత్రంగా భావించే ముస్లింలు ఈ తుపాకుల వినియోగాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఫిబ్రవరి 26, 1857న ప్రయోగాత్మకంగా తుపాకుల్ని పరీక్షించాలని బ్రిటీషర్లు ఆదేశించగా.. బారక్‌పూర్‌లోని 19వ దళం సిపాయిలు వ్యతిరేకించారు. దీంతో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. సిపాయిల తిరుగుబాటు అనంతరం 1857, మార్చి 29న అదే బారక్‌పూర్‌లోని 34వ పటాలానికి చెందిన మంగళ పాండే తూటాని వినియోగించేది లేదని తేల్చి చెప్పేశాడు. దీంతో అతనిపై దూషణకి దిగిన సైనికాధికారి లెఫ్టినెంట్ బాగ్‌ని మంగళ పాండే కాల్చి చంపేశాడు. దీంతో క్రమశిక్షణ చర్యల కింద పాండేని ఆంగ్లేయులు ఉరి తీశారు. అనంతరం 19, 34 పటాలాలను రద్దు చేశారు. అయితే.. ఈ తిరుగుబాటు దావానంలా దేశం మొత్తం వ్యాపించింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో సిపాయిలు ఆ తూటాలను వినియోగించేందుకు నిరాకరించారు. దీంతో వారిని ఉద్యోగాల్లోంచి తీసేసి.. పదేళ్లు జైలు శిక్ష విధించారు. పాండే తిరుగుబాటు స్ఫూర్తితో.. ఢిల్లీ చేరిన సిపాయిలు భక్తఖాన్ ఆధ్వర్యంలో ఎర్రకోటలో ప్రవేశించి.. బహదూర్ షాని భారతదేశ చక్రవర్తిగా ప్రకటించి ఉద్యమానికి నాయకత్వం వహించమని కోరారు. కాన్పూర్‌లోనూ నానాసాహెబ్ నాయకత్వంలో తిరుగుబాటు ప్రారంభమైంది. కానీ.. సరైన దిశా నిర్దేశం లేకపోవడంతో ఈ తిరుగుబాటు నీరు గారిపోయింది. బహదూర్ షాని బ్రిటీషర్లు అదుపులోకి తీసుకుని రంగూన్ జైలుకి తరలించడంతో ఉద్యమం గతి తప్పింది. నానాసాహెబ్ నేపాల్ పారిపోయాడు. బ్రిటీషర్లు అప్పట్లో పైచేయి సాధించినా.. ఈ సిపాయిల తిరుగుబాటు మాత్రం స్వాతంత్ర్య పోరాటంలో చెరగని ముద్ర వేసిన తొలి పోరాటంగా భారతీయుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆధునిక భారతదేశంలో పాండేను హీరోగా విస్తృతంగా పరిగణిస్తారు. ఆయనను గౌరవించటానికి 1984 సంవత్సరంలో భారత ప్రభుత్వం తపాలా బిళ్ళను జారీ చేసింది. హిందీ చిత్రం 'మంగల్ పాండే: ది రైజింగ్' మరియు 2005 లో 'ది రోటీ తిరుగుబాటు' అనే రంగస్థల నాటకంతో సహా అనేక సినిమాలు మరియు రంగస్థల నాటకాలు అతని జీవితంపై ఆధారపడి ఉన్నాయి.

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక



నిజాం నిరంకుశ పాలనలో బానిసలుగా బతుకుతున్న వారి స్వేచ్ఛకోసం, తమ జీవితాన్ని త్యజించిన వారిలో 'సర్దార్ జమలాపురం కేశవరావు' ముందు వరుసలో నిలుస్తారు. కట్టెదుట జరుగుతున్న అన్యాయాలకు చూస్తూ, సహిస్తూ ఉండలేక ప్రజల్లో ధైర్య సాహసాలను నూరిపోయడమే ఏకైక లక్ష్యంగా జీవితాంతం మందుకు సాగారు. హైదరాబాద్ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీకి జీవంపోసి, ప్రజా శ్రేయస్సు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిబద్ధత కలిగిన నేత, త్యాగశీలి సర్దార్ జమలాపురం కేశవరావు. సత్యాగ్రహిగా, క్విట్ ఇండియా ఉద్యమ కార్యకర్తగా, ఆంధ్రమహాసభ నిర్వాహకుడిగా, గ్రంథాలయోద్యమ నిర్మాతగా, ఆదివాసీ, దళిత జనోద్ధారకుడిగా, పత్రిక స్థాపకుడిగా ఇలా కొన్ని ఎన్నో కార్యకలాపాలు చేపట్టి హైదరాబాద్ రాజ్య ప్రజల్లో చైతన్యాన్ని, ధైర్యాన్ని నింపిన మహోన్నతుడు కేశవరావు. అందుకే ఆయన్ను అందరూ తెలంగాణ 'సర్దార్'గా పిలుచు కుంటారు. తెలంగాణ కేసరిగా, 'దక్కన్ సర్దార్'గా బిరుదులందుకున్న జమలాపురం కేశవరావు తనదైన శైలిలో ఉద్యమాలు నడిపి కాంగ్రెస్‌కు, తెలుగు వారి ముఖ్యంగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోశారు. దక్కన్ సర్దార్‌గా, ఉక్కు మనిషిగా ప్రజలు పిలుచుకునే కేశవరావు నిజాం సంస్థానంలో తూర్పు భాగాన ఉన్న ఖమ్మం (నాటి వరంగల్ జిల్లా)లోని ఎర్రుపాలెంలో 1908, సెప్టెంబర్ 3 న జమలాపురం వెంకట రామారావు, వెంకట నరసమ్మలకు తొలి సంతానంగా జన్మించారు. సంపన్న జమిందారీ వంశంలో పుట్టినా, నాటి దేశ రాజకీయాలు అతనిని తీవ్రంగా కలవర పరచాయి. ఎర్రుపాలెం లో ప్రాథమిక విద్య అనంతరం, హైదరాబాదులోని నిజాం కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. వందేమాతరం గీతాలాపనను నిషేధించి నందుకు నిరసనగా, కళాశాల విద్యార్థులను కూడగట్టి, నిరసనోద్యమంలో కాలూనారు. గీతాన్ని ఆలాపించ నివ్వకపోతే తరగతులకు హాజరు కాబోమని హెచ్చరించారు. దీంతో చివరకు నిజాం పాలకవర్గం నిషేధాన్ని ఎత్తివేయక తప్పలేదు. ఈఘటన తర్వాత కేశవరావు ఆలోచనా పరిధి మరింత విస్తృతం అయింది. నిజాం పాలనలో కొనసాగుతున్న వెట్టి చాకిరితో అష్టకష్టాలకు గురవుతున్న ప్రజలను చూసిన కేశవరావు చలించి పోయారు. ప్రజలను విముక్తం చేయడానికి తెలంగాణ జిల్లాల్లో...ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కేశవరావు కాలినడకన విస్తృతంగా పర్యటించారు. ఆ క్రమంలోనే భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల, గాంధీ సిద్ధాంతాల పట్ల కేశవరావు ఆకర్షితుడయ్యారు.

1923లో రాజమండ్రిలో మొదటిసారి మహాత్మా గాంధీ ఉపన్యాసాన్ని విన్న కేశవరావు, 1930లో విజయవాడలో జరిగిన సభలో గాంధీ పరిచయంతో మరింత ఉత్తేజితుడైనాడు. ఆంధ్రపితామహుడుగా మాడపాటి హనుమంతరావు ప్రారంభించిన గ్రంథాలయ ఉద్యమంను తెలంగాణలోని ప్రతి పల్లెలోనూ ప్రచారం గావించారు. వయోజన విద్యకై రాత్రి పాఠశాలలు నడపడంలో కేశవరావు కృషి చేశారు. అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని నింపడానికి ప్రత్యేక శ్రద్ధను కనపరిచేవారు. 1938లో దీపావళి సందర్భంగా ఆవిర్భవించిన 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' స్థాపనలో కేశవరావు కీలకపాత్ర వహించి, దానికి మొదటి అధ్యక్షుడయ్యారు. 1938 సెప్టెంబర్ 24 మధ్యాహ్నం మధిరలో గోవిందరావు నానక్, జనార్ధనరావు దేశాయ్, రావి నారాయణరెడ్డిలతో కలిసి సత్యాగ్రహ దీక్షకు కేశవరావు సిద్ధమయ్యాడు. ఎట్టి పరిస్థితుల్లో సర్దార్‌ను దీక్ష చేయనివ్వొద్దని నిజాం ప్రభుత్వం అనుమతి నివ్వలేదు. మధిరలో అడుగడుగునా పోలీసులను మోహరించింది. అయినా భారీ సంఖ్యలో ప్రజలు దీక్ష వేదిక దగ్గరకు చేరుకున్నారు. అప్పుడే ఎవరూ ఊహించని విధంగా రైతు వేషంలో దీక్ష వేదిక దగ్గరకు వచ్చాడు కేశవరావు. వెంటనే మహాత్మాగాంధీకి జై, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ జై అని దిక్కులు పెక్కటిల్లేలా నినాదించారు. అరెస్టు చేసి నిషేధాన్ని ఉల్లఘించి సత్యాగ్రహ దీక్ష చేశారంటూ కేశవరావుకు 18 నెలలు జైలు శిక్ష విధించారు. వరంగల్ జైలులో ఎనిమిది నెలల శిక్షను అనుభవించిన తర్వాత కేశవరావుతో సహా రాజకీయ ఖైదీలందరినీ నిజామాబాద్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా అదే పోరాట పంథాను కేశవరావు కొనసాగించారు. అంటరానితనం నిర్మూలించేందుకు, ఆదివాసీల అభివృద్ధికి కూడా ఉద్యమం చేశారు. 1942లో కాంగ్రెస్ పిలుపు మేరకు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని తెలంగాణలో ఊరూరా ప్రచారం చేసే బాధ్యత వహించారు. 1946లో మెదక్ జిల్లా కందిలో కేశవరావు అధ్యక్షతన జరిగిన 13వ ఆంధ్ర మహాసభ సందర్భంగా నిర్వహించిన బ్రహ్మాండమైన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. 1947 ఆగస్టు 7న మధిరలో స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన సత్యాగ్రహం మరువలేనిది. దానికి బాధ్యుడైన కేశవరావుకు ప్రభుత్వం రెండు సంవత్సరాలు కారాగార శిక్ష విధించింది. యావత్ భారత దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చు కోవడానికి ఉవ్విళ్లూరుతున్న సందర్భంలో కేశవరావు వంటి నాయకులు నిర్బంధానికి గురికావడం ఒక విషాదం. నిజాం సంస్థానం భారత దేశములో విలీనమైన తరువాత, 1952లో కేశవరావు రాజ్యసభకు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌పై పోలీసు చర్య అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలను తీవ్రంగా నిరసించిన మొట్టమొదటి కాంగ్రెస్ వ్యక్తి కేశవరావు. అప్పటి మిలిటరీ అధికారి నంజప్పను నిలదీసిన నిజమైన ప్రజానాయకుడు సర్దార్. కాంగ్రెస్ పార్టీలో ఉండి జాగీర్దార్లను, జమిందార్లను విమర్శించమంటే ఆనాడు నిజంగా ఒక సాహసమే. నంజప్ప నేతృత్వంలో మిలిటరీ వారు కమ్యూనిస్టుల ఏరివేత పేరిట జరిగిన హింసా కాండను, ముస్లిముల ఊచకోతను కేశవరావు ఖండించారు. ప్రజల పక్షాన నిలిచారు. "మనం ఏ ప్రభుత్వాన్ని అయినా సరే అది రాష్ట్ర, జాతీయ ప్రభుత్వం, కాంగ్రెసు ప్రభుత్వం అయినా, కాంగ్రెసు కాని ప్రభుత్వం అయినా అమాయక ప్రజలపై అత్యాచారాలు జరపడాన్ని సహించబోము. నంజప్ప మన ప్రభుత్వంలో ఒక అధికారి మాత్రమే. యింకా స్పష్టంగా చెప్పాలంటే ఆయన మన ప్రజలకు సేవకుడు. ఆయన యధేచ్ఛగా ప్రవర్తించడానికి, మేము అనుమతించడానికి సిద్ధముగా లేము. ఆయన చేస్తున్న అకృత్యాలు నిజాం తొత్తులైన జాగీర్దార్లను, నాజీ హిట్లరును తలదన్నిన నిజాంను మరిపిస్తున్నది. నంజప్ప తెలంగాణ రక్షకుడిగా కాక, భక్షకుడిగా వచ్చినట్లు అనిపిస్తున్నది." అని డోర్నకల్లులో జరిగిన సభలో కేశవరావు ఎలుగెత్తి చాటారు. సర్దార్ కేశవరావు భాషారాష్ట్ర సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకి. తెలంగాణ అస్తిత్వాన్ని స్థిరీకరించాలని కోరుకున్నారు. కన్నడ, మరాఠీ భాషా ప్రాంతాలతో కలిసి పోయిన హైదరాబాద్ రాష్ట్రం అలాగే ఉండాలని వాంచించారు. అలాగే జమిందారి, జాగిర్దారీ వ్యవస్థలతో అతలాకుతలమైన తెలంగాణను విశాలాంధ్రలో కలిపినట్లయితే ఏమాత్రం మేలు జరగదని నొక్కి చెప్పారు. విద్యాపరంగా, సామాజిక, ఆర్థిక రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయకుండా విశాలాంధ్ర ఏర్పాటు వల్ల స్థానికులపై స్థానికేతరుల అజమాయిషీ ఆరంభ మవుతుందని ముందుగానే ఊహించిన అనుభవశాలి ఆయన. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ సభలు, సమావేశాలు జరిగినపుడు ఒక సామాన్య కార్యకర్త మాదిరిగా పందిళ్ళు వేయడానికి, కర్రలు కూడా నాటి నిరాడంబరతకు, పార్టీ పట్ల అంకితభావంకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచి, అంతలా పార్టీకి సేవ చేసిన ఆయనకు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల మూలంగా రావాల్సినంత పేరు, దొరకాల్సిన గౌరవం రాలేదు. చేపట్టిన ప్రతి ఉద్యమం లోనూ విజయాల్ని సాధించిన ఆయన స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనకు ద్రోహం చేశారు. ఆయన ఎదుగుదలను అడ్డుకున్నారు. ఎన్నికల్లో ఓటమి చెందేలా పరిస్థితులు కల్పించారు. జైలు జీవితం, ఉద్యమ సమయంలో భోజనం లేకపోవడం, పార్టీలోని నాయకులు చేసిన మోసం, కలగలిసి తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అయిన కేశవరావు1953, మార్చి 29న తన 46వ ఏట మరణించారు.



# మంచిదని ఫుల్లుగా తాగుతున్నారా?

అతిగా నీరు తాగడం మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచి, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి హానికరం. తరచుగా మూత్రవిసర్జన, వాపు, తలనొప్పి వంటి లక్షణాలు అధిక హైడ్రేషన్‌ను సూచిస్తాయి. మీ వయస్సు, బరువు, శారీరక శ్రమను బట్టి రోజుకు 2-3 లీటర్లు తాగడం సరిపోతుంది. ఆరోగ్యకరమైన మూత్రపిండాల కోసం సమతుల్య జీవనశైలి అవసరం. మీరు ఎంత ఎక్కువ నీరు తాగితే అది మీ శరీరానికి, పిండాలకు అంత మంచిదని చాలా మంది నమ్ముతారు.. ఇలానే రోజు మొత్తంలో ఎక్కువ నీరు తాగుతారు.. అయితే.. మూత్రపిండాల పని రక్తాన్ని శుభ్రపరచడం, శరీరం నుండి అవసరమైన, విషపూరిత పదార్థాలను వేరు చేయడం.. మూత్రం ద్వారా వాటిని విసర్జించడం. మనం తాగే నీరు ఈ ప్రక్రియలో సహాయపడుతుంది. కానీ నీటిని అధికంగా వినియోగించినప్పుడు, అది మూత్రపిండాలపై అధిక ఒత్తిడిని కలిగిస్తుంది.. శరీర సహజ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఎక్కువ నీరు త్రాగడం వల్ల తరచుగా మూత్ర విసర్జన, వాపు, తలనొప్పి , అలసట, వికారం, కొన్నిసార్లు తలతిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంతమందికి చేతులు, కాళ్ళు బరువుగా ఉండటం, నిద్ర పట్టడంలో ఇబ్బంది కలగవచ్చు. ఈ సంకేతాలు శరీరం అవసరమైన దానికంటే ఎక్కువ నీటిని తీసుకుంటున్నట్లు సూచిస్తాయి. ఢిల్లీ ఆర్‌ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి దీని గురించి సవివరంగా వివరించారు. ఒక వ్యక్తి నిరంతరం అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తాగినప్పుడు, మూత్రపిండాలు దానిని పదే పదే ఫిల్టర్ చేయాల్సి వస్తుంది. ఇది మూత్రపిండాల సామర్థ్యంపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. అధిక నీరు శరీరంలోని ఉప్పు, ఇతర ఎలక్ట్రోలైట్‌ల సమతుల్యతను దెబ్బతీస్తుంది.. దీని వలన సోడియం స్థాయిలు తగ్గుతాయి. ఈ స్థితిలో, కణాలలో నీరు పేరుకుపోవడం ప్రారంభమవుతుంది, ఇది మెదడు, కండరాలకు హానికరం కావచ్చు. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, మూత్రం చాలా పాలిపోయినట్లు కనిపించడం లేదా తరచుగా మూత్రవిసర్జన చేయడం కూడా ఒక సంకేతం కావచ్చు. ఇది చాలా కాలం పాటు కొనసాగితే, ఇప్పటికే బలహీనమైన మూత్రపిండాలు ఉన్నవారిలో సమస్య మరింత తీవ్రమవుతుంది. అందువల్ల, ఎక్కువ నీరు త్రాగడం వల్ల మూత్రపిండాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుంది.. అని వివరించారు. నీటి అవసరాలు ప్రతి వ్యక్తికి ఒకేలా ఉండవు. అవి వయస్సు, బరువు, వాతావరణం, శారీరక శ్రమ, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటాయి. సాధారణంగా, రోజుకు 2 నుండి 3 లీటర్ల నీరు సరిపోతుందని భావిస్తారు. వేడి వాతావరణంలో లేదా మీరు అధికంగా చెమట పట్టినట్లయితే ఈ మొత్తాన్ని కొద్దిగా పెంచవచ్చు. దాహం వేసినప్పుడు నీరు త్రాగడం, మీ మూత్రం రంగును గమనించడం సులభమయిన మార్గం.. లేత పసుపు రంగు సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మీ మూత్రం స్పష్టంగా, తరచుగా వస్తూ ఉంటే, అది అధిక హైడ్రేషన్‌కు సంకేతం కావచ్చు. మీ వైద్యుడిని సంప్రదించకుండా మీరు ఎక్కువ నీరు తాగే అలవాటును పెంచుకోకూడదు. మీ మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి నీరు మాత్రమే కాదు, సమతుల్య జీవనశైలి కూడా అవసరం. మీ ఉప్పు తీసుకోవడం పరిమితం చేయండి.. వేయించిన ఆహారాలను నివారించండి. క్రమం తప్పకుండా భోజనం చేయండి.. తగినంత నిద్ర పొందండి. మీ వైద్యుడిని సంప్రదించకుండా ఎక్కువ కాలం నొప్పి నివారణ మందులు తీసుకోవడం మానుకోండి.. ఎందుకంటే అవి మీ మూత్రపిండాలను దెబ్బతీస్తాయి. రక్తపోటు, చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడం కూడా మూత్రపిండాల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. మితమైన వ్యాయామం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి.

# ఆరోగ్యానికి ఏది మంచిది?



ఆరోగ్యం పట్ల అవగాహన పెరగడంతో డైట్ చార్ట్‌లో సూపర్ ఫుడ్స్ హవా కొనసాగుతోంది. ముఖ్యంగా చియా సీడ్స్, గుమ్మడి గింజలు పోషకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. అయితే బరువు తగ్గాలనుకునే వారు దేనిని ఎంచుకోవాలి? కండరాల పుష్టి కోసం ఏది మేలు చేస్తుంది? ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేసుకోవచ్చనే అవగాహన అందరిలోనూ వస్తోంది. ఈ క్రమంలోనే సూపర్ సీడ్స్‌గా పిలిచే చియా గింజలు, గుమ్మడి గింజలు నేడు ప్రతి ఒక్కరి కిచెన్ డైట్‌లో భాగమవుతున్నాయి. అయితే ఈ రెండింటిలో ఏది మీ శరీరానికి ఎక్కువ మేలు చేస్తుందనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. వాస్తవానికి ఈ రెండు గింజలు పోషకాల గనులే అయినప్పటికీ, వాటి పనితీరు, ప్రయోజనాలు వేర్వేరుగా ఉంటాయి.
మీరు బరువు తగ్గాలని లేదా జీర్ణక్రియను మెరుగుపరుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటే చియా సీడ్స్ అద్భుతమైన ఎంపిక. వీటిలో గుమ్మడి గింజల కంటే సుమారు ఐదు రెట్లు ఎక్కువ ఫైబర్ ఉంటుంది. ఈ పీచు పదార్థం వల్ల ఆహారం తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. తద్వారా అనవసరమైన ఆకలి తగ్గుతుంది. అంతేకాకుండా చియా గింజలు ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, కాల్షియానికి ప్రధాన వనరులు. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఎముకల దృఢత్వానికి కూడా తోడ్పడతాయి. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారిలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి ఇవి ఎంతగానో సహకరిస్తాయి. మరోవైపు కండరాల బలం, మానసిక ప్రశాంతత కోరుకునే వారికి గుమ్మడి గింజలు సరైన తోడుగా నిలుస్తాయి. చియా గింజలతో పోలిస్తే వీటిలో ప్రోటీన్ శాతం చాలా ఎక్కువ. శరీర కణాల మరమ్మత్తుకు, కండరాల నిర్మాణానికి ఈ ప్రోటీన్ అత్యవసరం. అన్నింటికంటే ముఖ్యంగా గుమ్మడి గింజల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడమే కాకుండా నరాలు, కండరాల పనితీరును మెరుగుపరుస్తుంది. రాత్రిపూట నిద్రలేమితో బాధపడేవారు ఈ గింజలను తీసుకోవడం వల్ల వీటిలోని ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ వల్ల ప్రశాంతమైన నిద్ర పడుతుంది. వీటిలో ఉండే జింక్ మరియు విటమిన్-ఇ రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా మారుతాయి. చివరగా ఈ రెండింటిలో ఏదో ఒకదానికే పరిమితం కాకుండా రెండింటినీ మీ దైనందిన ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల మీకు ఫైబర్, ప్రోటీన్, మెగ్నీషియం, ఒమేగా-3 వంటి అన్ని రకాల పోషకాలు సమతుల్యంగా అందుతాయి. అయితే తీసుకునే విధానంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. చియా గింజలను ఎప్పుడూ నేరుగా పొడిగా తినకూడదు వాటిని నీటిలో లేదా స్మూతీస్ వంటి ద్రవ పదార్థాల్లో కనీసం 20 నిమిషాలు నానబెట్టిన తర్వాతే తీసుకోవాలి. గుమ్మడి గింజలను పచ్చిగా లేదా దోరగా వేయించి స్నాక్స్‌లా తీసుకోవచ్చు. మీ శరీర అవసరాలను బట్టి ఈ సూపర్ సీడ్స్‌ను మీ డైట్‌లో భాగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందండి.

# ఈ చేప తింటే ఆ సమస్యలన్నీ మాయం




అధిక రక్తపోటు, మధుమేహం, కొవ్వు సమస్యలతో సతమతమవుతున్నారా? అయితే చేపల ప్రియుల కోసం ఒక శుభవార్త.. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. పండుగప్ప చేపను తినడం వల్ల దీర్ఘకాలిక సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చని తేలింది. నాన్‌వెజ్ ప్రియుల బాగా ఇష్టంగా తినేది చేపలు. చేపల పులుసు, చేపల ఫ్రై అంటే చాలా మందికి పిచ్చి. అయితే మీరు మార్కెట్‌కు వెళ్లే ముందు ఈ విషయం తెలుసుకోండి. మీరు బరువు తగ్గాలని చూస్తున్నారా? లేదా కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవాలనుకుంటున్నారా? అయితే పండుగప్ప చేప మీ ఆహారంలో ఉండాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. కొడువా చేప కేవలం రుచిలోనే కాదు ఆరోగ్య ప్రయోజనాల్లోనూ మేటి అని తేలింది. ముఖ్యంగా రక్తపోటును నియంత్రించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. 2017-18లో పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు నిర్వహించిన పరిశోధన ఫలితాలు గతేడాది విడుదలయ్యాయి. ఈ నివేదిక ప్రకారం.. పండుగప్ప చేప రక్తంలోని చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గిస్తుందని స్పష్టమైంది. పండుగప్ప చేపలో ఉండే ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. దీనివల్ల గుండె జబ్బులు, గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అంతేకాకుండా ఇందులోని ఒమేగా-3 ఆమ్లాలు మెదడు పనితీరును మెరుగుపరిచి, జ్ఞాపకశక్తిని పెంచుతాయి. ఇది పిల్లల నుండి వృద్ధుల వరకు అందరికీ ఎంతో మేలు చేస్తుంది. ఈ చేపలో విటమిన్-ఎ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి చూపును మెరుగుపరచడమే కాకుండా వృద్ధులలో వచ్చే కంటిశుక్లం సమస్యను ఆలస్యం చేస్తాయి. అలాగే ఇతర చేపలతో పోలిస్తే ఇందులో విటమిన్-డి అత్యధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చడానికి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి తోడ్పడుతుంది. బరువు తగ్గాలని కఠినమైన డైట్ ఫాలో అయ్యేవారికి ఈవా చేప ఒక గొప్ప వరం. 100 గ్రాముల పండుగప్ప చేపలో సుమారు 22 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది కండరాల బలానికి అవసరం. సాల్మన్ చేపతో పోలిస్తే ఇందులో కేలరీలు సగం మాత్రమే ఉంటాయి. అధిక ప్రోటీన్, తక్కువ కేలరీలు ఉండటం వల్ల ఇది శరీరంలో అదనపు కొవ్వును కరిగించి, బరువు తగ్గడానికి దోహదపడుతుంది.

# వేసవిలో మజ్జిగ ఎక్కువగా తాగుతున్నారా?



వేసవికాలంలో చాలా మంది మజ్జిగ ఎక్కువగా తాగుతుంటారు. కొందరు సాధారణ మజ్జిగ తాగుతారు. మరికొందరు జీలకర్ర, ఇతర మసాలాలు, సుగంధ ద్రవ్యాలు కలిపి మసాలా మజ్జిగ తాగుతారు. కొందరు భోజనం తర్వాత, మరికొందరు రాత్రి భోజనం తర్వాత మజ్జిగ తాగుతారు. కానీ అందరూ మజ్జిగ తాగడం వల్ల ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరి శరీరంలో తలెత్తే సమస్యలు భిన్నంగా ఉంటాయి. కాబట్టి, సాధారణంగా మజ్జిగ తాగడానికి బదులుగా, మజ్జిగ తాగేటప్పుడు కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆయుర్వేదంలో, మజ్జిగ తీసుకోవడం ప్రతి వ్యక్తి శరీర స్వభావాన్ని బట్టి భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు, వాత స్వభావం ఉన్నవారు మజ్జిగ తాగే ముందు కొన్ని మార్పులు చేసుకోవాలి. వాత స్వభావం ఉన్నవారు నేరుగా చల్లని మజ్జిగ తాగే బదులు 1 చిటికెడు ఉప్పు కలిపి మజ్జిగ తాగాలి. ఇలా చేయడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. తరచుగా మజ్జిగ తాగిన వెంటనే టాయిలెట్‌కు వెళతారు. ఉప్పు లేదా నల్ల ఉప్పుతో మజ్జిగ తాగడం వల్ల తరచూ మూత్రానికి వెళ్లే వారికి సమస్య తగ్గుతుంది. ఇలా చేస్తే జీర్ణక్రియ బలంగా ఉంటుంది. సరిగ్గా తీసుకుంటే, వాత, పిత్త, కఫ అనే మూడు దోషాలను సమతుల్యం చేయడంలో మజ్జిగ ప్రయోజనకరంగా ఉంటుంది. పిత్త స్వభావం ఉన్నవారు మజ్జిగను ఎలా తాగాలి?: పిత్త స్వభావం ఉన్నవారు చిటికెడు గ్రాన్యులేటెడ్ చక్కెరతో కలిపి మజ్జిగ తాగాలి. పిత్తాశయ రాళ్ళు శరీరంలో వేడిని సృష్టిస్తాయి. వాపు, ఆమ్లత్వాన్ని కలిగిస్తాయి. మజ్జిగ, గ్రాన్యులేటెడ్ చక్కెర మిశ్రమం శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది మంచి జీర్ణక్రియకు సహాయపడుతుంది. కఫ స్వభావం ఉన్నవారు మజ్జిగను ఎలా తాగాలి?: కఫ స్వభావం ఉన్నవారు మజ్జిగలో చిటికెడు సుంతను కలిపి తాగాలి. ఇది మజ్జిగ తాగిన వెంటనే కఫం బయటకు రాకుండా చేస్తుంది. గొంతు నొప్పి, ముక్కు మూసుకుపోవడం వంటి సమస్యలు తలెత్తవు, జీర్ణక్రియ మందగించదు. ఆయుర్వేదం ప్రకారం, ఏదైనా పానీయం లేదా ఆహార పదార్థం, ప్రభావం ఏ వ్యక్తిపైనా ఒకేలా ఉండదు. సరిగ్గా తీసుకుంటే, ఏదైనా ఆహార పదార్థం ఔషధంలా పనిచేస్తుంది. అందువల్ల, శరీర లోపాలు, ధోరణులను దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాలను తీసుకోవాలి. తద్వారా ఇది జీర్ణక్రియను సమతుల్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.

# 105 మొబైల్ ఫోన్లు బాధితులకు తిరిగి అందజేత





**ఆదిలాబాద్ :** మొబైల్ ఫోన్ లేనిదే ఎలాంటి పని జరగని ఈ అధినాతన సమాజంలో మనకు అత్యంత విలువైనది, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే సాంకేతిక పరికరం మొబైల్ ఫోన్. మొబైల్ ఫోన్లో అన్ని వివరాలు, అన్ని జ్ఞాపకాలు, అన్ని లావాదేవీలకు సంబంధించిన అప్లికేషన్లు ఉంటాయి, సాధారణంగా ప్రజలు మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడం, దొంగలించబడటం జరుగుతుంది. పోగొట్టుకున్న వాటిని పొందాలంటే, బాధితులు వెంటనే వెబ్సైట్ లో లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా నందు ఇలా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి సంపాదించడం కోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా రికవరీ బృందాన్ని ఏర్పాటు చేశారని, ఇలా జిల్లా ఎస్పీ ఆదేశాలతో వీరు గత 30 రోజుల వ్యవధిలో దాదాపు వివిధ రాష్ట్రాల నుండి జిల్లాల నుండి బాధితులు పోగొట్టుకున్నటువంటి, దొంగలించబడిన టువంటి 105 మొబైల్ ఫోన్ లను తిరిగి రాబట్టడం జరిగింది. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుండి ఇప్పటివరకు ఒక సంవత్సర కాలంలో 1100 మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టడం జరిగింది. ఇలా ఇంత మొత్తంలో రాబట్టడం జిల్లా చరిత్రలోనే ప్రథమం, మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు దాదాపు మధ్యతరగతి కుటుంబీకులు, బీదవారు వారు ఎంతగానో కష్టపడి కొనుక్కున్న మొబైల్ ఫోన్ ను తిరిగి వారికి అందజేయాలని సదుద్దేశంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఈ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా మొబైల్ ఫోన్ దొంగతనాలు జరిగే ప్రాంతాలు రైతు బజార్, రిమ్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇళ్లలో దొంగతనాలు, బంధువులకు ఫోన్ చేస్తానంటూ ఫోన్ తస్కరించడం లాంటివి జరుగుతున్నాయని వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మొబైల్ ఫోన్లను తిరిగి ఇచ్చే క్రమంలో స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశం మందిరంలో ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న, చోరీకి గురైనటువంటి బాధితులకు 105 మొబైల్ ఫోన్లు (దాదాపు 15.8 లక్షల విలువ చేసే ) వివిధ ప్రాంతాల నుండి తెప్పించి బాధితులకు తిరిగి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి అందుకున్న బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ, జిల్లా ఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రతి నెల రోజుల లో పోగొట్టుకున్నటువంటి మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టి బాధితులకు అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. బాధితులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే దగ్గర్లో ఉన్న సంబంధిత పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని తెలిపారు. మొబైల్ ఫోన్ దుకాణాల యజమానులు, రిపేరింగ్ దుకాణాల యజమానులు, మొబైల్ ఫోను కొనే ముందు మొబైల్ ఫోన్ యజమాని అనుమతి సరైన పత్రాలు తీసుకోవాలి, దొంగ మొబైల్ ఫోన్లు కొన్న ఎడల వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ముఖ్యంగా రాబట్టిన మొబైల్ ఫోన్లు ఉత్తర భారతదేశంలో ఉండటం వాటిని ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో తిరిగి రాబట్టడం జరిగిందని తెలిపారు. మొబైల్ దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేయడం జరిగిందని. దొంగలించిన పడిన మొబైల్ ఫోన్ల కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ డి.ఎస్.పి ఎల్ జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ప్రత్యేక బృందం సభ్యులు ఆర్ఎస్ఐ పి గోపి కృష్ణ, ఎం ఎ రియాస్, మజీద్, త్రిశూల్, అన్వేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జైశెట్టి రమణయ్య మరణం చరిత్రకు తీరని లోటు



**జగిత్యాల :** చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున స్వర్గస్తులైన జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ చరిత్రకారులు జైశెట్టి రమణయ్య పార్థివ దేహంకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పోతరవేణి తిరుపతి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చరిత్ర పితామహునిగా ప్రసిద్ధిచెందిన జైశెట్టి రమణయ్య మరణం తెలంగాణ చరిత్రకు, ఈ ప్రాంత చరిత్రకారులకు తీరనిలోటు అని అన్నారు. తెలంగాణ చరిత్రకు ఆయన చేసిన సేవలను అమోఘమని, జగిత్యాల పట్టణంలోనే మొదటి ఏం.ఏ పట్టభద్రుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సోషల్ సైన్సెస్ లో మొదటి డాక్టరెట్ పట్టభద్రుడుగా అయన మాకు ఆదర్శనీయులు. వారు రాసిన చాళుక్య- కాకతీయ దేవాలయాల చరిత్ర, దక్షిణ భారత దేవాలయాల చరిత్ర అనే గ్రంధాలు దక్కన్ వాస్తు శిల్పకళా రీతులను తెలుసుకోవడానికి గొప్ప ప్రామాణికం అన్నారు. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా చరిత్ర సంస్కృతి గ్రంధం మొత్తం తెలంగాణ జిల్లా చరిత్ర రచనలకే మార్గదర్శనం. జగిత్యాల జిల్లా చరిత్ర సంస్కృతి, తెలంగాణలో ప్రముఖ దేవాలయాలు,కోటలు అనే గ్రంధాలు నేటి చరిత్ర పరిశోధకులకు ఎంతో ఉపయుక్తం అని పేర్కొన్నారు. ఇక అన్నింటి కంటే ముఖ్యంగా ఆయన చరిత్రకారుడిగా నిత్యజీవితంలోని, సమకాలీన సంఘటనలను డైరీ రూపంలో రాయడం చరిత్రలోనే ఒక నూతన ఒరవడి. దాదాపు 58 ఏళ్ళ చరిత్రను డైరీ రూపంలో రాయడం ఆయనకే చెల్లిందన్నారు. రమణయ్య జీవితాంతం చరిత్ర బోధన, పరిశోధన, రచనల పట్ల ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తరువాత ఈ ప్రాంత చరిత్రను ఇక్కడి ప్రతి విద్యార్థికి బోధించాలని అందుకై ఇంటర్మీడియట్ స్థాయి నుంచి డిగ్రీ వరకు అన్ని కోర్సుల్లో చరిత్రను తప్పనిసరి సబ్జెక్టు చేయాలని కలలుగన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్, నరేష్, నిర్మల, రజిత తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో 1803 రోజులుగా అన్నార్తులకు అన్నదానం





**వేములవాడ :** ట్రస్టు ఆధ్వర్యంలో దాతలు అందిస్తున్న సహకారంతో 1803 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున రాజన్న ఆలయం వద్ద 150 మంది భక్తులకు అన్నార్తులకు దాతలు అందించిన సహకారంతో అన్నదాన కార్యక్రమంతో పాటు స్వీట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నదాతలుగా కొడిమ్యాల వెంకట రాములు లత దంపతుల 50వ. పెళ్లిరోజు సందర్భంగా వడ్లకొండ శ్రవణ్ మరియు కుటుంబ సభ్యులు,మనుమని పుట్టినరోజు సందర్భంగా కె.ఆర్. ఉదయశ్రీ రెడ్డి,పెళ్లిరోజు సందర్భంగా హన్మకొండ జిల్లా శాయంపేట వాస్తవ్యులు పిండి ప్రవీణ్ కుమార్ సాయికీర్తి దంపతులు శాశ్వత దాతలుగా డాక్టర్ జువ్వాడి వెంక టేశ్వర రావు,స్నేహలత దంపతులు ప్రతాప స్వప్న సంపత్ దంపతులు గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు,దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు రామడుగు శ్రీలత,కొడుకులు కోడళ్లు ప్రజ్ఞ శరత్చంద్ర దంప తులు,శిరీష సాయిచంద్ర దంపతులు,శర్వాణి రవిచంద్ర దంపతులు హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష,సాయి కృష్ణ ఉన్నారని మీయొక్క పుట్టినరోజు పెళ్ళిరోజు మరియు ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు అన్నార్తులకు ఒక్క పూట భోజనం అందించడానికి సహకారం అందించే దాతలు ట్రస్టు సభ్యులను గాని 92469 39388 నంబరుకు సంప్రదించాలని,ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గొంగళ్ల రవికుమార్,వొడ్యాల వేణు,నాగుల చంద్రశేఖర్,ప్రతాప నటరాజు,పొలాస రాజేందర్ పసుల,శ్రీధర్ సగ్గు రాహుల్,మధు కవిత,మధు ప్రత్యూష, చిన్నారి ప్రతాప వేదజ్ఞ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వి.ఎస్.ఎస్. ఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



**గోదావరిఖని :** మల్లికార్జున్ ప్రాంతానికి చెందిన మెకానిక్ జాఫర్ గత ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై తన కాలు విరిగిపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న జాఫర్ కుటుంబానికి వెలుగు సామాజిక స్వచ్ఛ ఆధ్వర్యంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ లు గడవేన సునీత,డా, సదానందం సహకారంతో నిత్యవసర సరుకులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ హాజరై మాట్లాడారు. సమస్య ఎక్కడ ఉంటుందో తమ వెలుగు సంస్థ తమ వంతు గా సహాయం అందిస్తూ రావడం జరుగుతుందని సురభి శ్రీధర్ తెలిపారు. గోదావరిఖని మల్లికార్జున్ నగర్ చెందిన టూ వీలర్ మెకానిక్ జాఫర్ 20 సంవత్సరాలుగా మెకానిక్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ రావడం జరిగింది అని. గత ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తన కాలుకు విరిగిపోయి నడవలేని పరిస్థితిలో ఉండి మంచానికే అంకితం కావడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని. వైద్య ఖర్చులకోసం డబ్బులు పెట్టుకునే స్తోమత లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని తెలుసుకొని జాఫర్ కుటుంబానికి తమ వంతు సహాయంగా తమ సంస్థ ఆర్గనైజర్ ల సహకారంతో నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. దాతలు ఎవరైనా ఉంటే జాఫర్ వైద్య ఖర్చులకోసం సహాయ సహకారాలు అందించాలని సురభి శ్రీధర్ కోరారు. కార్యక్రమంలో సామాజిక సేవకురాలు ఉరకొండ రజిత, జాఫర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమస్యలపై మంత్రి పొన్నం సమావేశం

**అదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం ప్రజాప్రతినిధుల హాజరు**

**హైదరాబాద్ :** ఉమ్మడి జిల్లాల వారిగా ఆర్టీసీ సమస్యల పై మూడవ రోజు ఆదిలాబాద్, కరీంనగర్ , ఖమ్మం జిల్లాల ప్రజా ప్రతినిధుల ముఖాముఖి సమావేశం మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించారు ఉమ్మడి జిల్లాల వారిగా తమ నియోజకవర్గాల్లో కొత్త బస్సులు, కొత్త రూట్లు , బస్ స్టేషన్ ల అభివృద్ధి , బస్ ల హాల్టింగ్,బస్ డిపో ల అవసరాలు టాయిలెట్స్ నిర్మాణాల తదితర వాటిపై ముఖాముఖి సమావేశంలో ఎమ్మెల్యేలు వినతి పత్రాలు సమర్పించారు. మహా లక్ష్మీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో నియోజకవర్గాల వారిగా కావాల్సిన మౌలిక సదుపాయాలు, కొత్త బస్సులు, బస్ స్టేషన్ ల అభివృద్ధి , కొత్త రూట్లు,బస్ డిపో ల అవసరాల పై మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో కలిసి ముఖాముఖి సమావేశాలు జరుపుతున్నారు. . మూడవ రోజు అదిలాబాద్ , కరీంనగర్ , ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో అసెంబ్లీ కమిటీ హాల్ -1 లో సమావేశాన్ని ఏర్పాటు చేఆరు. ..చెన్నూరు నియోజకవర్గంలో బస్ స్టేషన్ అభివృద్ధి తో పాటు కొత్త రూట్ లలో బస్సులు నడిపించాలని మంత్రి వివేక్ వెంకట్ స్వామి సూచించారు. సింగరేణి ఏరియా లో కార్మికులకు ఇబ్బందులు లేకుండా గతంలో నడిచిన రూట్లతో పాటు అదనపు రూట్ లలో నడిపించాలని కోరారు. సమీక్షా సమావేశంలో కరీంనగర్ ఆదిలాబాద్ , ఖమ్మం ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, డా,, సంజయ్ కుమార్,కౌశిక్ రెడ్డి ,మేడిపల్లి సత్యం, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, విజయ రమణ రావు , వెడ్మా బొజ్జు,కోవా లక్ష్మి ,అనిల్ జాదవ్ , రామారావు పటేల్ ,పాల్వాయి హరీష్ బాబు ,పాయం వెంకటేశ్వర్లు ,రాందాస్ నాయక్ , జారే ఆది నారాయణ, కోరం కనకయ్య ,ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడి లు , ఆర్ఎం లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాఘవ కన్ స్ట్రక్షన్స్ అన్ని ఫీజులు కట్టింది

**హైదరాబాద్ :** రాఘవ కన్ స్ట్రక్షన్స్ అన్ని ఫీజులు కట్టిందని రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ స్పష్టత నిచ్చారు. శనివారం అయన అసెంబ్లీలో మాట్లాడుతూ రాఘవ కన్ స్ట్రక్షన్ డిసెంబర్ నాటికి పర్మిట్ ఫీజ్ 1 కోటి 22 లక్షల 25 వేల 446 రూపాయలు. సినరేజ్ ఫీజ్ 1 కోటి 52 లక్షలు 97 వేలు 825 రూపాయలు ఇప్పటికే కట్టింది. రాష్ట్ర ఖజానాకు ఆ కంపెనీ ద్వారా ఎక్కడా నష్టం కలగలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ కోసం మైనింగ్ సంస్థలు ఎదురు చూస్తుంటాయి. రాఘవ కన్ స్ట్రక్సన్స్ కూడా కేంద్ర అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంది. హరీశ్ రావు ఉద్దేశ పూర్వకంగా వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు.

## ఆశ వర్కర్లను అరెస్టులు చేయడం అన్యాయం

**ఆశ వర్కర్ల పట్ల ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలి**

**సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్**



**రాజన్న సిరిసిల్ల :** ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శనివారం రోజున ఆశా వర్కర్ల చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ మహాధర్న ను భగ్నం చేయాలని జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆశా వర్కర్లను అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్భందించడాన్ని సిఐటియు రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ తీవ్రంగా ఖండించారు ఈ సందర్భంగా సిరిసిల్లలోని సుందరయ్య నగర్ , అంబేద్కర్ నగర్ ( పి హెచ్ సి) ల ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేసి అక్రమంగా పోలీస్ స్టేషన్ లో నిర్భందించిన వారిని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల జరుగుతున్న ఈ సందర్భంగా ప్రభుత్వం ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలో కి వస్తే ఆశా వర్కర్ల కు నెలకి 18 వేల రూపాయల ఫిక్స్ వేతనాన్ని ఇస్తామని,పని భద్రత కల్పిస్తామని అనేక హామీలు ఇవ్వడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 27 నెలలు అవుతున్న ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆశాలకు రావలసిన పారితోషకాలు కూడా సకాలంలో ఇవ్వకుండాఅన్యాయం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి నిరసన , ధర్నా తెలియజేసే హక్కు కల్పిస్తున్నామని చెబుతూనే మరోవైపు శాంతియుతంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాకు వెళుతున్న ఆశా వర్కర్లను పోలీసుల చేత నిర్బంధించడం అన్యాయం అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి ఆశ వర్కర్ల పైన చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీల కోసం బడ్జెట్ కేటాయించాలని లేకుంటే రానున్న రోజుల్లో పోరాటాలు , ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో లావణ్య , చంద్రకళ , రజిత , నిర్మల , మమత , లక్ష్మి , గీత , స్వప్న , జ్యోతి , బాలలక్ష్మి , అనిత తదితరులు ఉన్నారు.

## సకాలంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ లో ఆర్,బీ శాఖ అభివృద్ధి పనుల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించి .ఆర్ బీ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు .ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి కాటారం పరిధిలో జరుగుతున్న రొడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. లింగాపూర్ రొడ్డు సంబంధించి విస్తరణ పనులు, మీడియన్, పైప లైన్ పనులు చేయాలని అన్నారు. రొడ్డు విస్తరణ పనులు సంబంధించి విద్యుత్ పోల్స్ తరలింపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి లో నిర్మించిన ఆర్ ,బీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశామని, సంబంధిత వివరాలను ఎంబీ రికార్డులలో నమోదు చేసి బిల్లులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. మానేరు నది పై చేపట్టిన బ్రిడ్జి టెండర్ త్వరగా పూర్తి చేయాలని రోడ్లు నిర్మించే సమయంలో త్రాగు నీటి పైప్ లైన్ పనులకు డ్యామేజి జరుగకుండా చూడాలని అన్నారు. మంథని గెస్ట్ హౌస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కునారం ఆర్ఓబి సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూ సేకరణ పూర్తి చేశామని, అక్కడ ఇండ్ల, ఇతర నిర్మాణాల కూల్చివేత పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని స్టేడియం నిర్మాణానికి సంబంధించి అవసరమైన అనుమతులు త్వరగా సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# బిజినెస్

## 2026-27 ప్రథమార్థంలో రూ.8.20 లక్షల కోట్ల ప్రభుత్వ రుణాలు



ఆదాయ లోటును భర్తీ చేసేందుకు 2026-27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబరులో డేటెడ్ సెక్యూరిటీల ద్వారా రూ.8 లక్షల కోట్లు సమీకరించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఆర్థిక శాఖ శుక్రవారం తెలిపింది. 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం స్థూల మార్కెట్ రుణాలు రూ.17.20 లక్షల కోట్లుగా ఉండాలి. బడ్జెట్ సమర్పణ తర్వాత జీ-సెక్ల మార్పుల కారణంగా, స్థూల మార్కెట్ రుణాలు రూ.16.09 లక్షల కోట్లకు తగ్గాయి. ఈ రూ.16.09 లక్షల కోట్లలో రూ.8.20 లక్షల కోట్లను (51%) ప్రథమార్థంలో డేటెడ్ సెక్యూరిటీల జారీ ద్వారా సమీకరించనున్నారు. ఇందులో రూ.15,000 కోట్ల విలువైన సార్వభౌమ హరిత బాండ్లు కూడా ఉంటాయి. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతంగా ఉంచేందుకు, రూ.17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోనున్నట్లు బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వాస్తవ గణాంకాల ప్రకారం.. 2026-27లో ద్రవ్యలోటు రూ.16.9 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా వేశారు. డేటెడ్ సెక్యూరిటీల ద్వారా, నికర మార్కెట్ రుణాలు రూ.11.7 లక్షల కోట్లుగా ఉండొచ్చని భావించారు. మిగిలిన నిధులు చిన్న మొత్తాల పొదుపు పథకాలు, ఇతర వనరుల నుంచి వస్తాయని అంచనా.

## భారత్‌లో నోకియా లేఆఫ్‌లు!




అంతర్జాతీయ పునర్నిర్మాణ పథకంలో భాగంగా, మనదేశంలోనూ కొందరు ఉద్యోగులకు లేఆఫ్ చేపట్టడానికి నోకియా సిద్ధమవుతోందని సమాచారం. 2026లో పునర్నిర్మాణ ప్రక్రియ చేపడతామని కంపెనీ గతేడాది నవంబరులో ప్రకటించింది. ఇందులో భాగంగా కంపెనీని నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మొబైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే రెండు విభాగాలుగా సరళీకరిస్తారు. మిగతా వ్యాపారాలన్నిటినీ పెట్టుబడుల ఉపసంహరణ లేదా సమీక్ష నిమిత్తం విడదీస్తారు. ప్రపంచవ్యాప్తంగా సంస్థకు 74,100 మంది ఉద్యోగులుండగా.. అందులో 20% వరకు కోతలుండొచ్చన్న అంచనాలున్నాయి. భారత్‌లోనూ అదే స్థాయిలో లేఆఫ్ చేయొచ్చని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల వార్తా సంస్థ ఒకటి పేర్కొంది. నోకియా ఇండియా కంట్రీ హెడ్‌గా ఉన్న తరుణ్ చాబ్రా నిష్క్రమణ నేపథ్యంలో, ఏప్రిల్ 1 నుంచి ఇండియా కంట్రీ బిజినెస్ లీడర్‌గా సమర్ మిత్తల్, ఇండియా కంట్రీ మేనేజర్‌గా విభా మెహ్రా నియమితులు కానున్నారని నోకియా సీఈఓ జస్టిన్ హోటర్డ్ ప్రకటించారు. మనదేశంలో నోకియా శాశ్వత ఉద్యోగుల సంఖ్య 2024లో 17,270 కాగా, గతేడాది 17,708కు పెరిగింది. ఈ ఏడాది మాత్రం ఉద్యోగ కోతలకు అవకాశం ఉందని అంచనా.

# కరిగిపోతున్న విదేశీ మారకం నిల్వలు




దేశ ఆర్థిక వ్యవస్థకు, అంతర్జాతీయ వాణిజ్య చెల్లింపులకు అత్యంత కీలకమైన విదేశీ మారక నిల్వలు అమాంతం కరిగిపోతున్నాయి. ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి 20తో ముగిసిన వారం రోజుల్లోనే ఏకంగా 11.413 బిలియన్ డాలర్ల (రూ.1 లక్ష కోట్ల పైగా) నిల్వలు కరిగిపోయి 698.346 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం వారంలోనూ 7.052 బిలియన్లు హరించుకుపోయి 709.759 బిలియన్లుగా నమోదయ్యాయి. ఫిబ్రవరి 27 నాటికి 728.498 బిలియన్ డాలర్లతో ఆల్‌టైం గరిష్టానికి చేరిన నిల్వలు పశ్చిమాసియాలోని యుద్ధంతో అమాంతం పడిపోతున్నాయి. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దాదాపు 18 బిలియన్ డాలర్లకు పైగా నిల్వలు తగ్గిపోవడంతో దేశ దిగుమతి సామర్థ్యంపై, అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనుంది. ఊహించని రీతిలో వరుసగా పతనం కావడం ఆర్థిక నిపుణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మారకం నిల్వల్లో ప్రధానమైన ఫారిన్ కరెన్సీ ఆస్తులు మార్చి 20తో ముగిసిన వారంలో 2.127 బిలియన్ డాలర్లు క్షీణించి 557.695 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. బంగారం నిల్వలు 13,495 బిలియన్ డాలర్లు తగ్గి 117.186 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద ఉన్న స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 65 మిలియన్ డాలర్లు తగ్గి 18.632 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఐఎంఎఫ్ వద్ద భారత రిజర్వ్ స్థాయిలు మాత్రం 19 మిలియన్ డాలర్లు పెరిగి 4.833 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ భారీ పతనానికి ప్రధానంగా బంగారు నిల్వల విలువలో వచ్చిన 13.495 బిలియన్ డాలర్ల భారీ కోత కారణమని రిజర్వ్ బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి. ఒకవైపు పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు మండిపోతుంటే, మరోవైపు మన వద్ద ఉన్న నిల్వలు ఇలా వేగంగా తగ్గిపోవడం రూపాయి విలువను మరింత పాతాళానికి నెట్టే ప్రమాదం ఉంది. ఇప్పటికే డాలర్‌తో రూపాయి 95 చేరువలో ఆల్‌టైమ్ కనిష్టానికి పడిపోగా.. రూపాయిని కాపాడుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న అస్త్రాలు తగ్గిపోతున్నాయనే సంకేతాలు ఈ గణాంకాలు ఇస్తున్నాయి. విదేశీ మారకం నిల్వల క్షీణత పరిస్థితి కొనసాగితే దిగుమతుల వ్యయం పెరిగి, దేశంలో నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరే అవకాశం ఉంది. విదేశీ నిల్వలలో వేగవంతమైన పతనం గనుక అదుపులోకి రాకపోతే రాబోయే రోజుల్లో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రికార్డు స్థాయిలో రూపాయి పతనం



భారతీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ పడిపోతూ ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికన్ డాలర్ బలోపేతం కావడం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో రూపాయి విలువ చారిత్రక కనిష్టానికి పడిపోయింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఒక్కరోజే భారీగా క్షీణించి, ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూ.94.82 వద్దకు చేరుకుంది. గతకొన్ని రోజులుగా డాలర్‌తో పోలిస్తే 93-94 మధ్య ఊగిసలాడుతున్న రూపాయి, నేడు ఒక్కసారిగా 86 పైసల మేర పతనమై 94.82 స్థాయిని తాకింది. ఈ ఏడాది (2026) ప్రారంభం నుండి రూపాయి సుమారు 5 శాతం మేర క్షీణించడం గమనార్హం.ఇరాన్, అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా చమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయం మార్కెట్లను వెంటాడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల మార్కును దాటడం భారత్ లాంటి దిగుమతి దేశాల కరెన్సీపై ఒత్తిడి పెంచుతోంది. చమురు ధరలు పెరగడంతో మన దేశ దిగుమతి వ్యయం భారీగా పెరిగి, కరెన్సీ నిల్వలపై ప్రభావం చూపుతోంది. భారత స్టాక్ మార్కెట్ల నుండి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఈఎఎబ) తమ నిధులను వెనక్కి తీసుకోవడం కూడా రూపాయి బలహీనపడటానికి కారణమైంది. రూపాయి విలువ పడిపోవడం వల్ల విదేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరగనున్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ముడిచమురు, వంట నూనెల ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడిపై భారం పడే ప్రమాదం ఉంది.

## వాట్సప్‌లో డ్యూయల్ అకౌంట్ సదుపాయం

మెటాకు చెందిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్, పలు కొత్త ఫీచర్లను శుక్రవారం ప్రకటించింది. ఇకపై ఐఫోన్ వినియోగదారులు ఒక ఫోన్‌లో, ఒకేసారి రెండు వాట్సప్ ఖాతాలు నిర్వహించుకోవచ్చు. దీంతో పాటు ఫోటో ఎడిటింగ్, మెసేజ్ డ్రాఫ్టింగ్ కోసం కొత్త కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్‌నూ సంస్థ తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగదారులకే 'టూ అకౌంట్స్, వన్ ఫోన్' ఫీచర్ అందుబాటులో ఉండగా.. ఇప్పుడు ఐఓఎస్ ప్లాట్‌ఫాం పైనా అందుబాటులోకి రానుంది. వ్యక్తిగత, వృత్తిపర సంభాషణలను నిర్వహించడానికి వినియోగదారులు రెండు వేర్వేరు ఫోన్లు వినియోగించాల్సిన అవసరం ఇకపై ఉండదని వాట్సప్ తమ బ్లాగ్‌లో పేర్కొంది. యాప్ కింద భాగంలో కనిపించే ప్రొఫైల్ పిక్చర్ ద్వారా ప్రస్తుతం ఏ ఖాతా యాక్టివ్‌గా ఉందో వినియోగదారులు గుర్తించొచ్చు. జనరేటివ్ ఏఐ ట్రెండ్‌కు అనుగుణంగా, వాట్సప్ నేరుగా చాట్‌లలో 'మెటా ఏఐ'ను అనుసంధానిస్తోంది. వినియోగదారులు ఇకపై మెటా ఏఐ ఉపయోగించి ఫోటోలను టచ్-అప్ చేయడం, అనవసరమైన అంశాలను తొలగించడం, బ్యాక్‌గ్రౌండ్ మార్చడం లేదా ఫోటో పంపే ముందు వివిధ స్టైల్స్ వాడటం వంటివి చేయొచ్చు. సంభాషణ సందర్భాన్ని బట్టి సమాధానాలను 'ఏఐ రైటింగ్ హెల్ప్' ఫీచర్ సూచిస్తుంది. ఏఐ టూల్స్ వల్ల భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తవని, వినియోగదారుల చాట్‌లు పూర్తి 'ప్రైవేట్'గా ఉంటాయని వాట్సప్ స్పష్టం చేసింది. మెటా ఏఐ కొత్త ఫీచర్లు వినియోగదారులందరికీ వెంటనే అందుబాటులోకి రాకపోవచ్చని కంపెనీ తెలిపింది.

# పడిక్కల్ ఊచకోత.. ఆరంభ పోరులో సన్‌రైజర్స్ ఓటమి!

# స్పోర్ట్స్



ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఓటమి తప్పలేదు. భారీ స్కోర్ల మ్యాచ్‌లో దేవ్‌దత్ పడిక్కల్(61), విరాట్ కోహ్లీ(69 నాటౌట్)ల మెరుపులతో ఆర్సీబీ జయకేతనం ఎగురవేసింది. హైదరాబాద్ నిర్దేశించిన 202పరుగుల ఛేదనలో ఆరంభంలో ఫిలిప్ సాల్ట్(8) ఔటైనా.. ఇంప్యాక్ట్ ప్లేయర్ పడిక్కల్ సునామీలా విరుచుకుపడ్డాడు. రజత్ పాటిదార్(31) ధనాధన్ ఆటకు కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్ తోడవ్వగా ఆర్సీబీ అలవోకగా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. పంతొమ్మిదో సీజన్ ఆరంభ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ పంజా విసిరింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆర్సీబీ భారీ లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. కొండంత ఛేదనలో దేవ్‌దత్ పడిక్కల్(61) ఊచకోతకు విరాట్ కోహ్లీ(69 నాటౌట్) క్లాస్ బ్యాటింగ్ తోడవ్వగా సన్‌రైజర్స్ బౌలర్లు బేజారయ్యారు. చిన్నస్వామి స్టేడియంలో పడిక్కల్, కోహ్లీ మెరుపులతో లక్ష్యం కరుగుతూ పోయింది. మూడో వికెట్‌కు పడిక్కల్‌తో 28 బంతుల్లోనే యాభై రన్స్ పిండుకున్న విఆరాట్ ఆ తర్వాత రజత్ పాటిదార్(31)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. మలింగ ఓవర్లో దూబే క్యాచ్‌తో పటిదార్ ఔటవ్వగా.. ఆ తర్వాతి బంతికే జితేశ్ శర్మ(0) సైతం వెనుదిరిగాడు. అయినా కోహ్లీ ఉండడంతో ఆర్సీబీ జట్టు కూల్‌గా ఉంది. హర్షల్ పటేల్ ఓవర్లో సిక్సర్, ఫోర్, ఫోర్ బాదిన కోహ్లీ జట్టును గెలిపించాడు. 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకున్న బెంగళూరు అదిరే బోణీ కొట్టింది. బౌలర్ల వైఫల్యంతో కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే ఇషాన్ ఓటమిని ఎదుర్కొన్నాడు.

**ఇషాన్, అనికేత్ దంచేయగా**

పంతొమ్మిదో సీజన్ ఆరంభ పోరులో టాస్ ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆదిలో తడబడినా కోలుకుంది. టాపార్డర్ విఫలమైన చోట ఇషాన్ కిషన్(80 :38 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. హెన్రిచ్ క్లాసెన్(31) జతగా 97 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ఇషాన్ భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. అనంతరం అనికేత్ వర్మ(43: 18 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు) నేనున్నాగా అంటూ తనమార్క్ విధ్వంసంతో ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఇషాన్, అనికేత్ మెరుపులతో ఆరెంజ్ ఆర్మీ ప్రత్యర్థికి 202 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

## ఐపీఎల్ మ్యాచ్‌లపై నిషేధం ఎత్తేసిన బంగ్లాదేశ్.. తీపి కబురుకు కారణమిదే..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ సందడికి తెరలేవనున్న వేళ బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమదేశంలోని క్రికెట్ అభిమానులకు తీపి కబురు చెబుతూ.. ఐపీఎల్ మ్యాచ్‌లపై నిషేధాన్ని ఎత్తేసింది. భారతదేశంతో దౌత్య సంబంధాలు పునరుద్ధరణలో భాగంగా బంగ్లాదేశ్ కొత్త సర్కార్ ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారాలకు ఆమోద ముద్ర వేసింది. ఈ విషయాన్ని శనివారం సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ మంత్రి జహీర్ ఉద్దీన్ స్వప్నన్ వెల్లడించారు. భారత్‌తో క్రికెట్ సంబంధాల పునరుద్ధరణకు నిరీక్షిస్తున్న బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆ దిశగా తొలి అడుగు వేసింది. రెహమాన్ తారీఖ్ సారథ్యంలోని కొత్త సర్కార్ ఐపీఎల్ ప్రసారాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసింది. ఆ దేశ సమాచార శాఖ మంత్రి జహీర్ ఉద్దీన్ స్వప్నన్ ఈ విషయాన్ని అధికారంగా ప్రకటించారు. 'ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రసారం చేయాలని ఏ ఒక్క టీవీ ఛానెల్ యాజమాన్యం మాకు దరఖాస్తు ఇవ్వలేదు. రాజకీయాలతో క్రికెట్‌ను ముడిపెట్టడం మాకు నచ్చదు. ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారం అంశాన్ని మేము వాణిజ్య కోణంలో చూస్తున్నాం. ఏ ఛానెల్ వారైనా ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారాల అనుమతి కోరితే.. మేము అంగీకరిస్తాం. మేము ఎవరినీ ఐపీఎల్ ప్రసారం చేయకుండా అడ్డుకోం. స్టార్ స్పోర్ట్స్ సంస్థ ప్రసారం చేయాలనుకుంటే వారికి అభ్యంతరం చెప్పం. అలాగనీ కచ్చితంగా ఐపీఎల్ మ్యాచ్‌లను టెలికాస్ట్ చేయాలని మేము ఎవరినీ బలవంతం చేయం' అని మీడియా సమావేశంలో జహీర్ ఉద్దీన్ వెల్లడించారు.

## ఇంగ్లండ్ క్రికెట్‌కు భారీ దెబ్బ



ఇంగ్లండ్ క్రికెట్‌కు భారీ దెబ్బ తగిలింది. ఆ దేశ టెస్ట్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ కొంతకాలం? ప్రొఫెషనల్ క్రికెట్‌కు దూరంగా ఉండనున్నాడు. త్వరలో ప్రారంభం కానున్న కౌంటీ సీజన్‌కు ముందు ఈ వార్త వెలువడింది. స్టోక్స్ కౌంటీ జట్టు (డర్హామ్) కోచ్ ర్యాన్ క్యాంప్‌బెల్ ఈ విషయాన్ని వెల్లడించాడు. అతని మాటల్లో.. స్టోక్స్ త్వరలో ప్రారంభం కానున్న కౌంటీ సీజన్‌కు అందుబాటులో ఉండాల్సింది. కానీ వైద్యులు అతనికి అనుమతి ఇవ్వలేదు. జూన్‌లో న్యూజిలాండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌కు కూడా అతను అందుబాటులో ఉండవపోవచ్చు. క్యాంప్‌బెల్ ఇచ్చిన ఈ సమాచారం మేరకు స్టోక్స్ సమీప భవిష్యత్తులో క్రికెట్ ఆడటం కష్టమేనని స్పష్టమవుతుంది. స్టోక్స్ ఇటీవల నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు బంతి ముఖానికి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. దీని వల్ల అతని ముఖానికి శస్త్రచికిత్స కూడా జరిగింది. గాయమైన ముఖంతో స్టోక్స్ పెట్టిన పోస్ట్ సోషల్‌మీడియాలో వైరలైంది. స్టోక్స్ చివరిగా జనవరి 8న సిడ్నీలో జరిగిన యాషెస్ టెస్ట్‌లో ఆడాడు. ఆ మ్యాచ్‌కు ముందు కూడా అతను గాయపడ్డాడు. వరుస గాయాలు అతని కెరీర్‌ను సందిగ్ధంలో పడేశాయి. స్టోక్స్ వ్యక్తిగతంగా, నాయకుడిగా విఫలం కావడంతో ఇంగ్లండ్ ఇటీవలి యాషెస్ సిరీస్‌ను 1-4తో కోల్పోయింది. ఈ దారుణ పరాభవం తర్వాత కూడా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు స్టోక్స్‌ను టెస్ట్ కెప్టెన్‌గా కొనసాగించాలని నిర్ణయించుకుంది. అయితే, తాజా గాయం స్టోక్స్ కెరీర్‌ను ప్రశ్నార్థకంగా మర్చేసింది. ఆటకు దూరంగా ఉన్నా, స్టోక్స్ ఇంగ్లండ్ క్రికెట్‌కు తన వంతు సహకారం అందిస్తూనే ఉన్నాడు. ఇంగ్లండ్ లయన్స్ జట్టుకు అతను కోచ్‌గా సేవలందిస్తున్నాడు.



# పెళ్లి తర్వాత కూడా తగ్గని జోరు... పాన్ ఇండియా రాణిగా రష్మిక హవా!

నేషనల్ క్రష్ రష్మిక మంధాన ప్రస్తుతం తన కెరీర్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వ్యక్తిగత జీవితంపై ఎన్ని ఊహాగానాలు వచ్చినా, సినిమాల విషయంలో మాత్రం ఆమె ఎక్కడా తగ్గే ప్రసక్తే లేదని తన వరుస ప్రాజెక్టులతో క్లారిటీ ఇస్తుంది. సాధారణంగా హీరోయిన్లు పెళ్లి తర్వాత కెరీర్ వేగం తగ్గించుకుంటారు. కానీ రష్మిక మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు దూసుకెళ్తోంది. ప్రస్తుతం రష్మిక చేతిలో ఉన్న ప్రాజెక్టులు చూస్తే, రాబోయే రెండేళ్లు బాక్సాఫీస్ వద్ద ఆమె ఆధిపత్యం కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో ఆమె క్రేజ్ గణనీయంగా పెరిగింది. ఇప్పటికే పుష్ప3లో శ్రీవల్లి పాత్రతో మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. సుకుమార్ దర్శకత్వంలో, అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతేకాదు, అల్లు అర్జున్– అట్లీ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కూడా రష్మిక పేరు వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్ కన్ఫర్మ్ అయితే ఐకాన్ స్టార్‌తో ఆమెకు హ్యాట్రిక్ మూవీ అవుతుంది. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లో కూడా రష్మిక జోరు తగ్గడం లేదు. యానిమల్ సినిమాతో సంచలన విజయాన్ని అందుకున్న ఆమె, దాని సీక్వెల్ యానిమల్ పార్క్‌లో మరోసారి గీతాంజలి పాత్రలో కనిపించనుంది. ఇందులో రణ్‌బీర్ కపూర్‌తో కలిసి ఆమె నటనపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇక 'కాక్టెయిల్ 2' వంటి ప్రాజెక్టులతో హిందీ ప్రేక్షకులను మరోసారి అలరించేందుకు సిద్ధమవుతోంది. గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, రష్మిక ఇప్పుడు విభిన్న కథలతో ముందుకు వస్తోంది. 'మైసా', 'రణబాలి' వంటి చిత్రాల్లో కొత్త తరహా పాత్రలతో తన నటనలోని మరో కోణాన్ని చూపించనుంది. ప్రత్యేకంగా 'రణబాలి'లో విజయ్ దేవరకొండతో కలిసి నటించబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ జోడీ మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. పెళ్లి తర్వాత కెరీర్ స్లో అవుతుందని అనుకునే ట్రెండ్‌ను రష్మిక పూర్తిగా మార్చేస్తోంది. భారీ సినిమాలు, పాన్ ఇండియా ప్రాజెక్టులు, విభిన్న పాత్రలు కలిసి ఆమెను ఇండియన్ సినిమా టాప్ హీరోయిన్‌గా నిలబెడుతున్నాయి. ఏది ఏమైన , స్టార్‌డమ్ తగ్గకుండా, మరింత ఎత్తుకు తీసుకెళ్లే దిశగా రష్మిక ముందుకు సాగుతోంది. రాబోయే కాలంలో బాక్సాఫీస్‌ను షేక్ చేసే సినిమాలతో ఆమె పేరు మరింత మోగడం ఖాయంగా కనిపిస్తోంది



# బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పెళ్లి తేదీ ఖరారు

టాలీవుడ్‌లో ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. యంగ్ హీరోలు వరుసగా బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్ బై చెప్పేస్తూ ప్రేమించిన వారితో ఏడడుగులు వేస్తున్నారు. ఇటీవల విజయ్, దేవరకొండ, రష్మిక ప్రేమ పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అలాగే అల్లు శిరీష్ కూడా తన ప్రియురాలు నయనిక పెద్దల సమక్షంలో ఒక్కటయ్యారు. ఇక ఇప్పుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన ప్రియురాలు కావ్యను త్వరలోనే పెళ్లాడబోతున్నట్లు వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల ఆయన కావ్యను సోషల్ మీడియాలో పరిచయం చేయడంతో అది నిశ్చితార్థం అని అందరూ భావించారు. కానీ, అది కేవలం పరిచయం మాత్రమేనని, అసలైన వేడుకలు ఇప్పుడే మొదలవ్వబోతున్నాయని క్లారిటీ ఇచ్చారు. తాజా సమాచారం ప్రకారం, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ – కావ్యల నిశ్చితార్థం ఏప్రిల్ 5న ఘనంగా జరగనుంది. ఆ వెంటనే ఏప్రిల్ 29న వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారని టాక్. అయితే, టాలీవుడ్ సెలబ్రిటీలందరూ విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ అంటూ హంగామా చేస్తుంటే, సాయి శ్రీనివాస్ మాత్రం అందుకు భిన్నంగా తిరుపతిలో చాలా సింపుల్‌గా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోవడం విశేషం. కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుక జరగనున్నట్లు తెలుస్తోంది. ఇక తిరుపతిలో పెళ్లి ముగిసిన తర్వాత, మే 1న హైదరాబాద్‌లో టాలీవుడ్ సినీ ప్రముఖుల కోసం ఒక భారీ రిసెప్షన్‌ను ఏర్పాటు చేయనున్నారు. సినీ ఇండస్ట్రీలోని పెద్దలందరినీ ఈ వేడుకకు ఆహ్వానించనున్నారట. నిన్న మొన్నటి వరకు విజయ్ దేవరకొండ, అల్లు శిరీష్ పెళ్లిళ్ల ముచ్చట్లతో బిజీగా ఉన్న నెటిజన్లు, ఇప్పుడు సాయి శ్రీనివాస్ పెళ్లి వార్త విని "ఇదేం సడెన్ ట్విస్ట్ సామీ!" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఏదేమైనా బెల్లంకొండ వారసుడు కూడా ఒక ఇంటివాడు కాబోతుండటంతో బెల్లంకొండ అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.




# ఓటీటీలోకి రాబోతున్న సుహాస్ 'హే బల్వంత్'

కలర్ ఫొటో, రైటర్ పద్మభూషణ్ వంటి చిత్రాలతో తన నటనకు మంచి మార్కులు కొట్టేసిన సుహాస్, ఇటీవల 'హే బలవంత్' చిత్రంతో థియేటర్లలో సందడి చేశారు. ఫిబ్రవరి 20న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. ఇప్పుడు ఈ మూవీ డిజిటల్ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కులను దక్కించుకుంది. థియేటర్లలో మిస్ అయిన వారందరి కోసం జీ5 ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చింది. మార్చి 31 నుండి 'హే బలవంత్' సినిమాను స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఈ చిత్రం అందుబాటులో ఉండనుంది. సుహాస్ నటనకు తోడు శివాని నాగరం అందం, అభినయం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాలో సీనియర్ నటుడు నరేష్, కమెడియన్ సుదర్శన్ కీలక పాత్రలు పోషించారు. కథ అంతా చాలా సహజంగా, కామెడీ ప్రధానంగా సాగడంతో ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమాపై ఆసక్తి చూపిస్తున్నారు. సమ్మర్ హాలిడేస్ మొదలవుతున్న క్రమంలో, ఇంటిల్లి పాదీ కలిసి నవ్వుకోవడానికి ఇదొక మంచి ఆప్షన్ అని చెప్పొచ్చు. థియేటర్లలో కంటే ఓటీటీలో సుహాస్ సినిమాలకు మంచి ఆదరణ లభిస్తుంది, కాబట్టి 'హే బలవంత్' కూడా డిజిటల్ ప్లాట్‌ఫామ్ పై రికార్డులు క్రియేట్ చేసే అవకాశం ఉంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com